రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త



నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న వజ్రేశ్‌యాదవ్ తదితరులు

## ఎంఎంసికి రూ.98 కోట్లతో సొంత భవనాలు

**ఉప్పల్ బగాయత్ వద్ద 10 ఎకరాల స్థలంలో నిర్మాణం**

**రేపు శంకుస్థాపన చేయనున్న సిఎం రేవంత్**

**ప్రస్తుతం తార్నాకలోని తాత్కాలిక కార్యాలయం నుంచి కార్యకలాపాలు**

**శాశ్వత ప్రధాన కార్యాలయంతో మెరుగైన సేవలు**

**డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ వెల్లడి**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 5 ప్రభాతవార్త:** ఈ నెల 7వ తేదీ సాయంత్రం మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లాలోని ఉప్పల్ బగాయత్‌లో మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) నూతన కార్యాలయ భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విచ్చేసి శంకుస్థాపన చేయనున్నట్లు మేడ్చల్ డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ వెల్లడించారు. శుక్రవారం నాడు కాంగ్రెస్ నాయకులతో కలిసి ఉప్పల్ బగాయత్‌లో శంకుస్థాపన జరగనున్న స్థలాన్ని పరిశీలించి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ఉప్పల్ బగాయత్ లేఅవుట్ ఫేజ్ త్రీ లో సుమారు 10 ఎకరాల భూమిని ఎంఎంసి కార్యాలయ భవన నిర్మాణం కోసం కేటాయించిందని, దీనిని సుమారు రూ.98 కోట్ల నిధులతో చేపట్టడానికి పరిపాలన అనుమతులు కూడా మంజూరు చేసిందని వజ్రేశ్‌యాదవ్ తెలిపారు. ప్రస్తుతం తార్నాకాలోని తాత్కాలిక కార్యాలయం నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఎంఎంసికి ఈ భవనం శాశ్వత ప్రధాన కార్యాలయంగా మారనుందని ఆయన పేర్కొన్నారు. జిల్లా పరిధిలోని మేడ్చల్, మల్కాజ్గిరి, ఉప్పల్, ఎల్బీనగర్ నియోజకవర్గ ప్రాంతాల ప్రజలకు అందుబాటులో ఉంటుందనే ఉద్దేశంతోనే ఉప్పల్ బగాయత్‌ను ఎంపిక చేశామని, ఈ నూతన భవన నిర్మాణంతో పరిపాలన మరింత సౌకర్యంగా మారి ప్రజలకు మెరుగైన సేవలు అందే అవకాశం ఉంటుందని మిగతా 2లో

**239 ఎకరాల విస్తీర్ణంలో కోహెడ అంతర్జాతీయ మార్కెట్**

**అన్ని రకాల వ్యవసాయ ఉత్పత్తులు ఒకే వేదికపై మార్కెటింగ్**

**భారీ కోల్డ్ స్టోరేజీలు, లాజిస్టిక్స్ పార్కులు, ప్యాకేజింగ్ కేంద్రాలకు ప్రణాళిక**

**మార్కెట్ ధరలను బట్టి రైతులు నేరుగా అమ్ముకునే అవకాశం**

**దళారీలకు చెక్‌పెట్టి గిట్టుబాటు ధరల లక్ష్యంతో అడుగులు**

**నిర్మాణ పనులకు నేడు సిఎం శ్రీకారం**



సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల తదితరులు



## వ్యవసాయ హంగులతో..



**రంగారెడ్డి అర్బన్, జూన్ 5 ప్రభాతవార్త:** తెలంగాణ రైతాంగ భవిష్యత్తును మార్చివేసే అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్టుగా కోహెడ అంతర్జాతీయ సమీకృత మార్కెట్ రూపుదిద్దుకుంటోంది. గతంలో నిలిచిపోయిన ఈ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో మళ్లీ ప్రాణం పోశారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ఈ ప్రాజెక్టు పనులకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టనున్నారు. ఈ నేపథ్యంలో సిఎం పర్యటన ఏర్పాట్లను మంత్రి తుమ్మల శుక్రవారం స్వయంగా పరిశీలించారు. అనంతరం అధికారులతో కలిసి నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో సమీక్షించారు. ఈ మార్కెట్ హైదరాబాద్‌కు సమీపంలో, ఔటర్ రింగ్ రోడ్‌కు ఆనుకుని, భవిష్యత్తులో వచ్చే రీజినల్ రింగ్ రోడ్‌కు అనుసంధానంగా ఉండే వ్యూహాత్మక ప్రాంతంలో నిర్మితమవుతోంది. రవాణా, ఎగుమతులతోపాటు నిల్వ సౌకర్యాలకు అత్యంత అనుకూలంగా ఉన్న ఈ సముదాయాలను సుమారు 239 ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. పండ్లు, కూరగాయలు, పూలు, మాంసం, ధాన్యాలు వంటి అన్ని రకాల వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు, అమ్మకాలు, నిల్వ, ప్రాసెసింగ్, ఎగుమతి, దిగుమతులకు అవసరమైన అన్ని వసతులు ఒకే చోట లభించనున్నాయి. ఇందులో రైతులు తమ ఉత్పత్తులను నేరుగా మార్కెట్‌కు తెచ్చి విక్రయించుకునేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల దళారీల పాత్ర తగ్గి, రైతులకు మెరుగైన ధరలు లభిస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. ప్రపంచ స్థాయి మౌలిక వసతులు మార్కెట్లో అత్యాధునిక గిడ్డంగులు, భారీ కోల్డ్ స్టోరేజీలు, లాజిస్టిక్స్ పార్కులు, ప్యాకేజింగ్ కేంద్రాలు, నాణ్యత పరీక్షా ల్యాబ్‌లు, డిజిటల్ ట్రేడింగ్ సదుపాయాలు సమకూర్చనున్నారు. దీనివల్ల రైతులు ఉత్పత్తులను ఎక్కువ కాలం నిల్వ ఉంచి, మార్కెట్ ధరలను బట్టి అమ్ముకోవచ్చని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

**ఇళ్ల నుంచే మార్కెట్ ధరలు తెలుసుకునే డిజిటల్ వ్యవస్థ**

ఆధునిక సాంకేతికత ద్వారా మార్కెట్ ధరలు, అందుబాటులో ఉన్న ఉత్పత్తుల వివరాలను ప్రజలు ఇళ్ల నుంచే తెలుసుకునేందుకు డిజిటల్ వ్యవస్థను ఏర్పాటుచేస్తున్నారు. వినియోగదారులకు కూడా నాణ్యమైన ఉత్పత్తులు ఒకే వేదికపై దొరుకుతాయి.

**మూడు దశల్లో పూర్తి చేయాలని లక్ష్యం**

ప్రభుత్వం ఈ ప్రాజెక్టును మూడు దశల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా మొదటి దశ పనులను వచ్చే ఏడాది జనవరి నాటికి పూర్తి చేయనున్నారు. ఆ తర్వాత మిగిలిన మౌలిక సదుపాయాలను దశలవారీగా అభివృద్ధి చేస్తారు.

**వ్యవసాయ, ఉద్యానవన రంగాలకు కొత్త ఊపు**

సిఎం ఏర్పాట్ల పరిశీలకు వచ్చిన ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కోహెడ మార్కెట్ తెలంగాణ వ్యవసాయ, ఉద్యానవన రంగాలకు నూతన ఊపునిస్తుందని, అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానం ద్వారా ఎగుమతులు పెరుగుతాయని పేర్కొన్నారు. దేశంలోనే కాకుండా ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందేలా ఈ మార్కెట్ రూపకల్పన జరుగుతోందని ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి తెలిపారు. రైతు-వినియోగదారుల ప్రత్యక్ష అనుసంధానమే దీని లక్ష్యమని చెప్పారు.

**జిల్లా నలుమూలల నుండి తరలి రానున్న రైతులు**

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో భారీ బహిరంగ సభా కార్యక్రమానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ సి. నారాయణరెడ్డి స్పందిస్తూ... పెద్ద సంఖ్యలో రైతులు, ప్రజాప్రతినిధులు రానుండటంతో రవాణా, పార్కింగ్, తాగునీరు, వైద్య సదుపాయాలు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. రైతులకు ఆధునిక సాంకేతికతపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక ప్రదర్శనలు, సమాచార కేంద్రాలను కూడా ప్రాంగణంలో ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

## ప్రైవేట్ స్కూల్ వ్యాన్లపై పోలీసుల ఫోకస్

**భద్రతా ప్రమాణాలపై ముమ్మరంగా తనిఖీలు** 3



జాబితా సమగ్ర సవరణపై దిశానిర్దేశం చేస్తున్న కలెక్టర్

## అక్టోబరులో తుది ఓటరు జాబితా

**ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు స్వీకరణ- కలెక్టర్ నారాయణ రెడ్డి**

**రంగారెడ్డి అర్బన్, జూన్ 5, ప్రభాతవార్త :** ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కొంగరకలాన్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. చంద్రారెడ్డితో కలిసి ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటి గణన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అనంతరం బూత్ స్థాయి అధికారులు వివరాలను పరిశీలించి అర్హులైన ఓటర్ల ముసాయిదా జాబితాను సిద్ధం చేయాలని సూచించారు.

హేతుబద్ధీకరించిన ముసాయిదా ఓటరు జాబితాను జూలై 31న ప్రచురించనున్నట్లు తెలిపారు. జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరించి, సెప్టెంబర్ 28లోపు వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు వెల్లడించారు.

**పారదర్శకంగా పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్**

పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ ప్రక్రియను పూర్తిస్థాయిలో పారదర్శకంగా నిర్వహించాలని, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు సాధ్యమైనంత వరకు ఒకే పోలింగ్ కేంద్ర పరిధిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్ల సహకారం తీసుకోవాలని పేర్కొన్నారు.ఒక వ్యక్తికి ఒకే ఓటరు గుర్తింపు కార్డు ఉండాలని, ఒకటి కంటే ఎక్కువ కార్డులు కలిగి ఉన్నవారు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే మరణించిన వ్యక్తుల పేర్లు తుది జాబితాలో ఉండకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నిరక్ష్యం వహించిన బీఎల్‌వోలపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా బూత్ స్థాయి అధికారులు, రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. చిరునామా మార్పులు, వివరాల సవరణలు, కొత్త ఓటర్ల నమోదు తదితర అంశాలను సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. అక్టోబర్ 1, 2026 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకునే యువత ఫారం6, డిక్లరేషన్ ఫారం ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఓటర్లు తమ వివరాల పరిశీలన, ఫారాల పూరణ కోసం టోల్ ఫ్రీ నంబర్ 1950, ఓటర్ పోర్టల్, ఈసీఐనెట్ యాప్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో ఆర్డీఓలు సరిత, జగదీశ్వర్ రెడ్డి, తహసీల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆ ఇసుకతో ఇళ్లు ఇక గుల్లే

★మట్టి, మొరంతో కృత్రిమ ఇసుక ★కుల్కచర్లలో పుట్టగొడుగుల్లా తయారీ కేంద్రాలు ★తక్కువ ఖర్చుతో లక్షల్లో ఆర్జన ★మైనింగ్, పొల్యూషన్ బోర్డు అనుమతులు నిల్ ★ప్రభుత్వ సబ్సిడీ విద్యుత్‌తోనే నకిలీ ఫిల్టర్ల నిర్వహణ ★కృత్రిమ ఇసుకతో ఇళ్లు కూలే ప్రమాదం ఉందని నిపుణుల హెచ్చరిక



పీరంపిల్లి గ్రామంలో ఫిల్టర్ ఇసుకతో కట్టిన గోడ పగుళ్లిచ్చిన దృశ్యం



కృత్రిమ ఇసుక కోసం పొలంలో తవ్విన మట్టి



ఫిల్టర్, నిల్వచేసిన నకిలీ ఇసుక

**కుల్కచర్ల, జూన్ 5 ప్రభాతవార్త:** కుల్కచర్ల మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. అయితే, స్థానికంగా ఉన్న ఇసుక కొరతను ఆసరాగా చేసుకుని కొందరు అక్రమార్కులు కృత్రిమ ఇసుక దందాకు తెరలేపారు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న చాలపగూడెం, తుపాకుల తాండ సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండానే ఈ వ్యాపారాన్ని మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగిస్తున్నారు. పంట పొలాల్లోని మొరం నేలల నుంచి మొరం మట్టిని, అలాగే పొలాల పక్కన ఉన్న వాగుల నుంచి మట్టిని తెచ్చి కృత్రిమంగా ఇసుకను తయారు చేస్తున్నారు. మట్టిని శుద్ధి చేసి ఇసుకగా మార్చడం కోసం అక్రమంగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను, నీటిని వాడుకుంటున్నారు. రైతుల కోసం ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ విద్యుత్‌ను ఇలా కమర్షియల్ దందాకు వాడుతున్నా రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

**తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం**

ఈ కృత్రిమ ఇసుక తయారీకి ఖర్చు చాలా తక్కువ. ఒక ట్రాక్టర్ ఫిల్టర్ ఇసుకను రూ. 3వేల నుండి రూ. 4వేల వరకు విక్రయిస్తున్నారు. నిజానికి నాణ్యమైన ఇసుక లేదా ఇసుక తయారీ చేపట్టాలంటే మైనింగ్ శాఖ, పరిశ్రమల శాఖ, కాలుష్య నియంత్రణ బోర్డుల నుండి అనుమతులు తప్పనిసరి. వీటన్నింటికీ కలిపి ఒక ట్రాక్టర్ ఇసుకకు సుమారు రూ. 5వేల నుండి రూ. 6వేల వరకు ఖర్చవుతుందని అంచనా. కానీ అక్రమార్కులు ఎలాంటి అనుమతులు లేకుండా ఉచితంగా మట్టిని తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు.

**11కి పైగా కేంద్రాలు**

ఒక్క చాలపగూడెం, తుపాకుల తాండ పరిసరాల్లోనే 11కి పైగా ఇలాంటి నకిలీ ఇసుక తయారీ కేంద్రాలు నడుస్తున్నాయంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఈ విధంగా నకిలీ మట్టితో తయారు చేసిన కృత్రిమ ఇసుకను నిర్మాణాలకు వాడటం వల్ల భవనాలకు పగుళ్లు ఇచ్చి, ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఉందని నిర్మాణ రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**మా దృష్టికి వచ్చింది, దాడులు చేస్తాం**

**తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి**

కృత్రిమ ఇసుక తయారు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కుల్కచర్ల తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి తెలిపారు. మట్టి తవ్వకాలకు గానీ, ఇసుక తయారీకి గానీ తాసీల్దార్ కార్యాలయం నుండి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఇసుక ఫిల్టర్లు నడుస్తున్న ఉదంతం తమ దృష్టికి వచ్చిం దని, త్వరలోనే దాడులు నిర్వహించి బాధ్యులపై కేసులు నమోదు చేయడంతో పాటు, ఇసుక డంపులను, రవాణా చేసే వాహనాలను సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు.



మట్టి కోసం పొలంలో తవ్విన గుంత



## రూ.60వేలు చెల్లించిన పేదలకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 5, ప్రభాతవార్త:** వాంబే హౌజింగ్ పథకం కింద లబ్ధిదారుల వాటా కింద డిడిల రూపంలో రూ.60వేల వరకు బాధిత లబ్దిదారులు ఒక్కొక్కరు చెల్లించారని ఆ పేద కుటుంబాల వారికి డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయించాలని జిల్లా సిపిఎం నాయకులు జిల్లా హౌజింగ్ పిడి పివి రమణమూర్తిని కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. శుక్రవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌కు సిపిఎం నాయకులు, ఆ బాధిత లబ్ధిదారులు విచ్చేసి జిల్లా హౌజింగ్ పిడి రమణమూర్తిని కార్యాలయంలో కలిసి వారు డబుల బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయించాలని కోరుతూ వినతిపత్రాన్ని సిపిఎం నాయకులు, బాధిత లబ్దిదారులు అందజేశారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బాలానగర్ మండలానికి చెందిన పలువురు పేదలు 2003సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం వాంబే హౌజింగ్ పథకం కింద ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పటంతో లబ్దిదారుల వాటాగ రూ.60వేల రూపాయల చొప్పున డిడిల రూపంలో చెల్లించటం జరిగిందన్నారు. అయితే ఇంత కాలం గడిచినా వారికి ఇళ్లు కేటాయించలేదని అన్యాయం జరిగిందని జిల్లా సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు ఐలాపురం రాజశేఖర్ విమర్శించారు. ఈ విషయంలో అప్పటి అధికారుల నిర్లక్ష్యం, వైఫల్యం కారణంగా పేదలు నష్టపోయారని అన్నారు. ప్రస్తుతం ప్రజాపాలన ప్రభుత్వంగా కొనసాగుతున్న ప్రభుత్వం స్పందించి అర్హులైన లబ్దిదారులకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించి న్యాయం చేయాలన్నారు.

## నగరవ్యాప్తంగా 'ఆపరేషన్ కవచ్'

**నంబర్ ప్లేట్ల ట్యాంపరింగ్‌పై నజర్**

**8,802 ద్విచక్రవాహనాలు గుర్తింపు**

**2,149 వాహనాలు స్వాధీనం**



**హైదరాబాద్, జూన్ 5 ప్రభాతవార్త :** శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా నగరవ్యాప్తంగా 'ఆపరేషన్ కవచ్' పేరిట హైదరాబాద్ సిటీ పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. రాత్రి 10 గంటల నుంచి 12 గంటల వరకు జరిగిన ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా, వాహనాల నంబర్ ప్లేట్ల ట్యాంపరింగ్‌పై దృష్టి సారించారు. ట్యాంపరింగ్ నేరగాళ్లకు సులభంగా తప్పించుకునే మార్గంగా మారడమే కాకుండా, అమాయకులను తప్పుడు ఈచలాన్లు, కేసుల గుప్పిట్లోకి నెడుతూ శాంతి భద్రతలకు తీవ్ర సవాల్ గా పరిణమిస్తోంది. ఈ ముప్పును అరికట్టడానికి ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక కీలక ప్రాంతాన్ని ఎంచుకుని, లా అండ్ ఆర్డర్ సిబ్బంది రోడ్లపై ఉండి ఈ తనిఖీలు నిర్వహించారు. జూబ్లీ హిల్స్, వెంకటగిరి, మధురానగర్, కృష్ణకాంత్ పార్క్, బోరబండ పిలీదర్గా, సనత్‌నగర్, అమీర్‌పేట్ సత్యం థియేటర్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెకింగ్ పాయింట్లను నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ సందర్శించారు. క్షేత్రస్థాయిలో తనిఖీల సరళిని పరిశీలించిన ఆయన, స్వయంగా కొన్ని వాహనాలను ఆపి నంబర్ ప్లేట్లను నిశితంగా పరిశీలించారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా నగర వ్యాప్తంగా వివిధ జోన్లలో కలిపి మొత్తం 12,098 వాహనాలను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఇందులో 8,802 ద్విచక్ర వాహనాలు, 1,693 నాలుగు చక్రాల వాహనాలు, 1,623 ఆటోలు ఉన్నాయి.

ఈ తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు ఉన్న 1,406 వాహనాలను, అసలు నంబర్ ప్లేట్ లేని 1,132 వాహనాలను, నకిలీ నంబర్ ప్లేట్లతో తిరుగుతున్న 69 వాహనాలను పోలీసులు గుర్తించారు. నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను మొత్తం 2,149 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

## ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

**హయత్ నగర్, జూన్ 5 ప్రభాతవార్త :** ఇంటర్ విద్యార్థి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండకు చెందిన కోమటిరెడ్డి దేవేందర్ రెడ్డి (17) కోహెడలోని చైతన్య కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువు తున్నాడు. మొదటి సంవత్సరం పరీక్షల అనంతరం హనుమకొండకి వెళ్లిన అతన్ని తండ్రి జలపతిరెడ్డి ఈనెల 2న తిరిగి కళాశాలకు తీసుకు వచ్చాడు. గురువారం రాత్రి అందరు భోజనాలకు వెళ్ళగా దేవేందర్ రెడ్డి గదిలోనే ఉన్నాడు. స్టడీ అవర్ అనంతరం 9 గంటల సమయంలో స్నేహితులు గదిలోకి వచ్చి చూడగా అతను టవల్, బేడీషీట్‌తో ఫ్యాన్ కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. విద్యార్థులు వెంటనే వార్డెన్ కు చెప్పగా.. కళాశాల ప్రతినిధులు అతన్ని హయత్ నగర్ లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అతన్ని పరీక్షి ంచిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఇంటర్ మొదటి ఏడాదిలో దేవేందర్ రెడ్డి కి 466/470 మార్కులు వచ్చాయి. అతని ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

## భార్యపై కత్తితో దాడి

**చికిత్స పొందుతూ మృతి**

**అత్తాపూర్ జూన్ 5, ప్రభాతవార్త :** అత్తాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలోని తేజస్వి నగర్ కాలనీలో దారుణ ఘటన చోటుచేసుకుంది.కట్టుకున్న భార్య కోమల్‌పై అనుమానంతో భర్త అవి నాశ్ కత్తితో దాడి చేయగా తీవ్రంగా గాయపడింది.వెంటనే ఆస్పత్రికి తరలిం చగా మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. దంపతులకు ఇద్దరు కుమారులు ఉండగా, కుటుంబ కలహాలు ఈ ఘాతుకానికి దారితీసినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు క్లూస్ టీం ఆధారాలను సేకరించారు.ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. తల్లి కోమలను తండ్రి చంపిన ఘటన గురించి కుమారుడు చెప్పిన తీరు ఒళ్లు గుగుర్లు పొడుస్తోంది. రాత్రి 3గం.కు వరకు గొడవ జరిగిందని కోపంగా అమ్మపై కత్తితో దాడిచేశాడు.

### పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**షాబాద్, జూన్ 5, ప్రభాతవార్త :** పర్యవరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని చందన్వెల్లి సర్పంచ్ చేవెళ్ల నవనీతస్వామి, చందన్వెల్లి మైక్రోసాఫ్ట్ మేనేజర్ వెంకట్నారాయణ అన్నారు. శుక్రవారం పర్యావరణ దినోత్సవం సందర్భంగా చందన్వెల్లి ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భావితరాలకోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలన్నారు. భావితరాలకు మనమిచ్చే గొప్ప సంపద చెట్లు అని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ప్రణీత్, వార్డు సభ్యులు వెంకటేష్, మైక్రోసాఫ్ట్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. అదే విధంగా పర్యవరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని సంకేపల్లిగూడ సర్పంచ్ కుమ్మరి లావణ్య చెన్నయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య ఉపసర్పంచ్ ప్రభాకర్, వార్డు సభ్యులు జయమ్మ, నరేందర్ గౌడ్, సత్తయ్య, పంచాయితీ కార్యదర్శి ఫయాజ్, గ్రామస్తులు పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బీజేపీ మండల అధ్యక్షుడు మద్దూరి మాణయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీందర్ రెడ్డి, రాము, మహేందర్, విజయ్, నరేందర్ రెడ్డి, నారాయణ, మహేందర్, ఆనంతం తదితరులు పాల్గొన్నారు.

### కొండా నర్సింహరెడ్డిని సన్మానించిన బిఆర్ఎస్ నాయకులు

**శామీర్‌పేట, జూన్ 5, ప్రభాతవార్త:**

శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ నూతన ఇన్స్‌పెక్టర్‌గా కొండా నర్సింహ్మారెడ్డి బాధ్యతలు చేపట్టటంతో మర్యాద పూర్వకంగా శామీర్‌పేట మండల బిఆర్ఎస్ నాయకులు వంగ వెంకట్‌రెడ్డి కలిసి సన్మానించారు. శుక్రవారం శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో నూతన సిఐ కొండా నర్సింహ్మారెడ్డిని కలిసి స్వాగతించి మర్యాద పూర్వకంగా ఆయనను బిఆర్ఎస్ మండల నాయకులు వంగ వెంకట్‌రెడ్డి కలిసి సన్మానించి స్వాగతించారు. శామీర్‌పేట సిఐగా నర్సింహ్మారెడ్డి బాధ్యతలు స్వీకరించటంతో ఆయనకు నాయకులు వంగ వెంకట్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు.

## హుస్సేన్‌పూర్‌లో బడిబాట

**కొడంగల్, జూన్ 5ప్రభాతవార్త**

మండల పరిధిలోని హుస్సేన్‌పూర్‌లో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇల్లూరి క్రాంతికుమార్, ఉపాధ్యాయురాలు ఐసంధ్య బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ అంజిలయ్య, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయురాలు శుక్రవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహించారు. బడి బయట ఉన్న చిన్నారులను గుర్తించి వారి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలో చదివించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. విద్య ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించి, పిల్లలను వెంటనే పాఠశాలలో చేర్పించేలా ప్రోత్సహించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం, యూనిఫాం, బూట్లు, సాక్సులు, డిజిటల్ తరగతి గదులు, సురక్షిత త్రాగునీరు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు తదితర సదుపాయాల గురించి తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా పలువురు పిల్లలు పాఠశాలలో ప్రవేశాలు పొందారు. వందశాతం ఎన్‌రోల్‌మెంట్ సాధనే లక్ష్యంగా ముందుకు సాగుతామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు క్రాంతికుమార్ తెలిపారు.

### ప్రీప్రైమరీ పాఠశాలల్లో ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టుల భర్తీ

#### ఎంఈఓ చెన్నయ్య

**ధారూర్, జూన్ 5, ప్రభాత వార్త:** ధారూర్ మండల పరిధిలోని ఐదు ప్రభుత్వ ప్రీప్రైమరీ పాఠశాలల్లో (కెరెల్లి, గట్టేపల్లి, కుక్కింద, గురుదోట్ల, మున్నూరు సోమారం) ఖాళీగా ఉన్న ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైనట్లు మండల విద్యాధికారి చెన్నయ్య తెలిపారు. పూర్తిగా తాత్కాలిక ప్రాతిపదికన చేపట్టే ఈ నియామకాలకు కేవలం అర్హులైన మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. ఎంపికైన వారికి ఏడాదికి 10 నెలల పాటు ప్రభుత్వం గౌరవ వేతనం చెల్లిస్తుంది. ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు నెలకు 8,000 (అర్హత: ఇంటర్, ఈసీఈ/డీఈడీ ఉన్నవారికి ప్రాధాన్యత), ఆయా పోస్టుకు నెలకు 6,000 (అర్హత: 7వ తరగతి) వేతనంగా నిర్ణయించారు. అభ్యర్థుల వయస్సు 18 నుండి 44 సంవత్సరాల మధ్య ఉండాలని, నియామకాల్లో స్థానిక గ్రామ పంచాయతీ, మండలానికి చెందిన వారికే మొదటి ప్రాధాన్యత ఉంటుందని ఎంఈఓ స్పష్టం చేశారు. కలెక్టర్ ఆధ్వర్యంలోని జిల్లా కమిటీ, అలాగే మండల స్థాయి కమిటీలు ఈ ఎంపిక ప్రక్రియను పర్యవేక్షిస్తాయి. అర్హత గల మహిళలు తమ విద్యార్హత పత్రాలు, ఆధార్, కుల, నివాస ధృవీకరణ పత్రాలు, ఫోటోలతో కూడిన దరఖాస్తులను నేరుగా సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుల కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది. ఈ నెల 5న ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ, ఎంపిక ప్రక్రియ మొత్తం జూన్ 10వ తేదీ నాటికే పూర్తవుతుందని, కాబట్టి అభ్యర్థులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ చెన్నయ్య సూచించారు.

### కొండల్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎలుగంటి మధుసూదన్ రెడ్డి

**షాబాద్, జూన్ 5, ప్రభాతవార్త :** సిఎం రేవంత్ రెడ్డి సోదరుడు ఎనుముల కొండల్ రెడ్డి జన్మదినం సందర్భంగా నగరంలో ఆయన నివాసంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

## ఎంఎంసికి రూ.98 కోట్లతో సొంత భవనాలు

(మొదటిపేజీ తరువాయి)

ఆయన అభిప్రాయపడ్డారు. ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విచ్చేసి చేపట్టే ఈ శంకుస్థాపన కార్యక్రమానికి మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని డిసిసి అధ్యక్షులు వజ్రేశ్‌యాదవ్ పిలుపునిచ్చారు. ఉప్పల్ బగాయత్లో స్థలాన్ని సందర్శించిన వారిలో ఆయనతో పాటు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు మల్రెడ్డి రాంరెడ్డి, చల్ల నరసింహరెడ్డి, బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్యాదవ్, మేడ్చల్ ఎంఎంసి చైర్మన్ బి. నర్సింలుయాదవ్, చర్లపల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, జవహర్ నగర్ మాజీ మేయర్ శాంతికోటేశ్ గౌడ్, మల్కాజ్గిరి కార్పోరేషన్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు ఉన్నారు.

## ఓటమి భయంతోనే నామినేటెడ్ విధానం

**గండి చెర్ల గోవర్ధన్ రెడ్డి**

**శంకర్‌పల్లి, జూన్ 5, ప్రభాతవార్త :** సహకార సంఘాల ఎన్నికలను నిర్వహించకుండా నామినేటెడ్ విధానాన్ని ప్రవేశపెట్టడం వెనుక ప్రభుత్వానికి ఎన్నికల్లో ఓడిపోతామనే భయమే కారణమని మండల టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గండిచెర్ల గోవర్ధన్ రెడ్డి ఆరోపించారు. ప్రజాబలంతో ఎన్నికలను ఎదుర్కొనే ధైర్యం అధికార పార్టీకి లేకపోవడంతోనే నాయకులు, కార్యకర్తలకు పదవులు కట్ట బెట్టేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఆయన విమర్శిం చారు. ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల ద్వారానే ప్రజా ప్రతినిధులు ఎంపిక కావాల్సి ఉండగా, ప్రభుత్వం నామినేటెడ్ విధానానికి ప్రాధాన్యం ఇవ్వడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. అధికార పార్టీ రాజకీయ ప్రయోజనాల కోసమే సహకార సంఘాలను తమ ఆధీనంలో ఉంచుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 330 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు (పీఏసీఎస్) ఎన్నికలు నిర్వహించకుండా పాత పాలకవర్గాలను రద్దు చేసి నామినేటెడ్ చైర్మన్లను నియమించాలన్న ప్రభుత్వ నిర్ణయం విడ్డూరం అన్నారు. సొసైటీల్లో గణనీయమైన నిధులు ఉండటంతో పాటు ఎన్నికలు నిర్వహిస్తే ప్రత్యర్థి వర్గాలు గెలిచే అవకాశముందనే ఆందోళన అధికార పార్టీ నేతల్లో కనిపిస్తోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు తమకు అనుకూల వ్యక్తులను చైర్మన్ పదవులకు నామినేట్ చేసుకునేలా ప్రయత్నాలు సాగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు.

# మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి

**కొడంగల్, జూన్ 5, ప్రభాతవార్త :** అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ ఎనుముల తిరుపతిరెడ్డి అన్నారు. శుక్రవారం కొడంగల్ పట్టణంలోని గురుకుల పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. గురుకుల పాఠశాల నిర్మాణ పనుల్లో జాప్యంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. పనుల్లో ఎందుకు పురోగతి లేదని అధికారులను ప్రశ్నించారు. బండరాళ్ళు ఉండడంతో జాప్యం జరుగుతుందని, వచ్చే నవంబర్ నాటికి పనుల పూర్తితో అప్పగిస్తామని సంభందిత అధికారులు తెలిపారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న పనులను పరిశీలించి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం సీఎం ప్రత్యేక కార్యదర్శి శ్రీనివాస్‌రాజుతో కలిసి పట్టణంలోని శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో బాలాలయంలో తిరుపతిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనకు ఆశీర్వచనాలతో పాటు తీర్థప్రసాదాలను అందించారు. అనంతరం శ్రీవారి ఆలయ పునఃనిర్మాణ పనులను పరిశీలించారు. పనుల్లో ఎప్పటినుంచి ప్రారంబిస్తారని వాకబు చేశారు. ఆలయ పునఃనిర్మాణ పనుల మ్యాప్‌ను పరిశీలించి పనులు సత్వరమే ప్రారంబించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. నాలుగు రోజుల్లో ఆలయ పునఃనిర్మాణ పనులు ప్రారంబిస్తామని అధికారులు తెలిపారు. అంతకుముందు తిరుపతిరెడ్డి బొంరాస్‌పేట్‌లో



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న తిరుపతిరెడ్డి

పర్యటించారు. బొంరాస్‌పేట్ మండలంలోని బూరాన్‌పూర్‌లో నిర్మిస్తున్న బీసీ వెల్ఫేర్ గురుకుల పాఠశాల నిర్మాణ పనులతో పాటు బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం వరికొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న రైస్ మిల్లర్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ధాన్యాన్ని



కొడంగల్ శ్రీవారి బాలాలయంలో పూజల్లో పాల్గొన్న కాంగ్రెస్ ఇంచార్జ్ తిరుపతిరెడ్డి

వెంటనే రైస్ మిల్లులకు తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మేన్ రాజేష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మండల పార్టీ అధ్యక్షులు నర్సిములుగౌడ్, మున్సిపల్ వైస్ చైర్మేన్ శంకర్‌నాయక్, కాంగ్రేస్ నాయకులు కొడంగల్ నయ్యూం, ఆసీఫ్‌ఖాన్ , సంజీవరెడ్డి, దీపక్‌రెడ్డి, రాము, దాము, మెరుగు వెంకటయ్య, పర్సాపూర్ మాజీ సర్పంచ్ కన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎట్టకేలకు రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి మోక్షం

**షాద్‌నగర్, జూన్ 5, ప్రభాతవార్త :** జిల్లా చటాన్‌పల్లి రైల్వే జంక్షన్ వద్ద ప్రతిపాదిత రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ కోసం రూ.184 కోట్ల నిధులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. భూ యజమానులకు పరిహారం చెల్లించేందుకు మరో రూ.34 కోట్లు కూడా కేటాయించినట్లు సమాచారం. ఈ ప్రాజెక్టు కోసం మొత్తం 212 మంది భూ నిర్వాసితుల నుంచి సుమారు 3.11 ఎకరాల స్థలాన్ని సేకరించనున్నారు. భూ సేకరణ ప్రక్రియ పూర్తయిన వెంటనే బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. చటాన్‌పల్లి రైల్వే జంక్షన్ వద్ద తరచూ ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతుండటంతో పాటు, రైల్వే గేటు మూసివేసే సమయంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు ఎన్నో ఏళ్లుగా ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని కోరుతూ వస్తున్నారు. ఇప్పటికే భూ సేకరణకు సంబంధించిన పరిపాలనా ప్రక్రియలు పూర్తికావడంతో రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. దీంతో షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ కృషి ఫలించిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. భూ సేకరణ పూర్తయి నిర్మాణ పనులు ప్రారంభమైతే చటాన్‌పల్లి, షాద్‌నగర్ పరిసర ప్రాంతాల ప్రజలకు ట్రాఫిక్ సమస్యల నుంచి శాశ్వత ఉపశమనం లభించనుంది. నిన్న



తహశీల్దార్ కార్యాలయం వద్ద ఫరూక్ నగర్ మండల పరిధి లోని చటాన్ పల్లి రైల్వే గేట్ నం ఎల్.సి నంబర్ 27 వద్ద రోడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కొరకు భూ సేకరణ కొరకు సేకరించిన విస్తీర్ణం యొక్క యాజమానులతో గ్రామ సభ నిర్వహించడం జరిగింది. ఇట్టి సమావేశంలో సంబంధిత యజమానులకు వారు కోల్పోతున్న విస్తీర్ణం మరియు ఇతర నిర్మాణాల పై వివరించడం అయినది , ఇట్టి సమావేశం నకు స్థానిక భూ సేకరణ అధికారి మరియు ఆర్డీవో ఎన్ఆర్ సరిత, స్థానిక తహశీల్దార్ నాగయ్య మరియు సంబంధిత రైల్వే అధికారులు స్థానిక రెవెన్యూ సిబ్బంది మరియు భూ సేకరణలో విస్తీర్ణం కోల్పోతున్న సంబంధిత యజమానులు పాల్గొన్నారు.

### గురుకుల విద్యాసంస్థల్లో ఆహార పదార్థాల సరఫరాల కోసం టెండర్ నోటిఫికేషన్ విడుదల

**షాద్‌నగర్, జూన్ 5, ప్రభాతవార్త :** 2026-27 విద్యా సంవత్సరానికి అవసరమైన ఆహార పదార్థాల సరఫరా కోసం టెండర్ నోటిఫికేషన్ విడుదలైంది. 2026 నంబర్‌తో జూన్ 4, 2026న జారీ చేసిన ఈ టెండర్ ద్వారా కూరగాయలు, చికెన్ మరియు మటన్, కోడిగుడ్లు, కిరాణా సామాగ్రి సరఫరాదారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. టెండర్ షెడ్యూల్ విక్రయం జూన్ 5 నుంచి ప్రారంభమవుతుంది. దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ జూన్ 13 కాగా, టెండంలను జూన్ 15న మధ్యాహ్నం 2:30 గంటలకు తెరవనున్నారు. మినీ గురుకులం, రంగాపూర్ విద్యాసంస్థలకు అవసరమైన సరఫరాలు నిర్వహించబడనున్నాయి. అర్హత కలిగిన సరఫరాదారులు నిర్ణీత గడువులోగా టెండర్ దరఖాస్తులను సమర్పించాలని అధికారులు సూచించారు.

### జడ్చర్ల బహిరంగ సభకు లింగారెడ్డిగూడ మహిళలు



**షాద్‌నగర్, జూన్ 5, ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జడ్చర్లలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు (చలో జడ్చర్ల) ఫరూక్ నగర్ మండలంలోని లింగారెడ్డిగూడ గ్రామం నుండి మహిళలు, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నేతృత్వంలో గ్రామానికి చెందిన మహిళలు భారీ సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేసేందుకు ఉత్సాహంగా బయలుదేరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎం.సి. ప్రవీణ్ కుమార్, ఉప సర్పంచ్ ఎర్రోళ్ల అశోక్ పాల్గొని మహిళలను, కార్యకర్తలను సమన్వయం చేశారు. వారితో పాటు వార్డు సభ్యులు మల్లేష్ యాదవ్, గ్రామ ప్రముఖులు యాదయ్య, బాలకృష్ణ మరియు ఇతర గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లిన వారిలో ఉన్నారు. ముఖ్యమంత్రి సభకు గ్రామం నుండి రికార్డు స్థాయిలో జనం హాజరవుతున్నట్లు స్థానిక నాయకులు ఈ సందర్భంగా తెలిపారు.

#### జడ్చర్లలో సిఎం సభలో పాల్గొన్న షాద్‌నగర్ కాంగ్రెస్ నేతలు

**షాద్‌నగర్, జూన్ 5, ప్రభాతవార్త :** జడ్చర్లలో నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభకు షాద్‌నగర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం, కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్ట వెంకటేష్ గౌడ్, సర్వర్ పాషా, వెల్జర్ల గ్రామ సర్పంచ్ ఆర్. బాబు నాయక్, చిలకమర్రి సర్పంచ్ రవీందర్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే పార్టీ నాయకులు ఆసాద్ ముక్తార్ అలీ,



సిఎం బహిరంగ సభలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

జాంగారి రవి, కాంగ్రెస్ పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సింగపాగా అనిల్ కుమార్, మాజీ సర్పంచ్ సోలీపూర్ శ్రీశైలం గౌడ్, అనిమీ గణేష్ గౌడ్, కెవీఎం బాల నర్సింహులు, రమేష్, అమర్నాథ్ రెడ్డి తదితరులు సభలో పాల్గొని ముఖ్యమంత్రి ప్రసంగాన్ని ఆలకించారు. సభ విజయవంతం కావడానికి షాద్‌నగర్ నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి కాంగ్రెస్ పార్టీకి తమ మద్దతును చాటారు.

### మొక్కలు నాటి పర్యావరణ సమసత్యులతను కాపాడుదాం

**చేవెళ్ల, జూన్ 5, ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిక్షి ంచుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా చేవెళ్ల మున్సిపల్ ప్రాంగణంలో మున్సిపల్ చైర్పర్సన్ సమతావెంకట్ రెడ్డి, కమిషనర్ యాదగిరి, పాలకవర్గం సభ్యులతో కలిసి ఎమ్మెల్యే యాదయ్య మొక్కలు నాటారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పర్యావరణాన్ని కాపాడం ప్రతి ఒక్కరి భాధ్యత అనిచెప్పారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ కనీసం ఒక్క మొక్కను నాటి సంరక్షి ం చాలన్నారు. చెట్లు మనవ మానుగడకు ప్రాణవాయువును అందించడమే కాకుండా పర్యావరణ సమసత్యులతను కా పాడటంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ వైస్ చైర్మన్ రాములుగౌడ్, కౌన్సిలర్లు బండార శైలజాఅగిరెడ్డి, శ్రీనివాస్, కళ్యాణి, సుచితారెడ్డి, మధుసూదన్ రెడ్డి, దయాకర్, నర్సింలు, మార్కెట్ చైర్పర్సన్ వెంటయ్యగౌడ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండుయాదవ్, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ పార్టీ నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని అందిద్దాం

**చేవెళ్ల, జూన్ 5, ప్రభాతవార్త :** భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించాలనే లక్ష ్యంతో చేవెళ్ల పుష్కరిణి ప్రాంగణంలో మొక్కలు నాటడం జరుగుతుందని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ మల్లారి వైభవ్ రెడ్డి, చేవెళ్ల మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు అనంతరెడ్డి తెలిపారు. శుక్రవారం ప్రపంచా పర్యావరణ దినోత్సవం సందర్భంగా చేవెళ్ల పట్టణ కేంద్రంలోని శ్రీ లక్ష్మీ ్మవెంకటేశ్వర స్వామి వారి పుష్కరిణి చుట్టు మొక్కలు నాటడంతోపాటు శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక భాధ్యత అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షి ంచుకోవాలన్నారు. చెట్ల పెంపకం ద్వారా పర్యావరణ సమతుల్యత కాపాడబటంతో పాటు భావితరాలకు స్వచ్ఛమైన జీవన వాతావరణం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల, రామన్నగూడ కౌన్సిలర్లు మానిషారెడ్డి, పి. దయాకర్, బీజేపీ సీనియర్ నాయకులు కం చం శ్రీనివాస్ గుప్తా, దేవుని శర్వలింగం, అడెట్ల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి కృష్ణగౌడ్, జైశంకర్ గౌడ్, మండల నాయకులు సత్యనారాయణ, శ్రీకాంత్ రెడ్డి, ప్రవీణ్రెడ్డి, అశోక్, చంద్రశేఖర్ రెడ్డి, పాగా వెంకటేష్, గణేష్, జయసింహారెడ్డి, గోవర్ధన్, రవి, చాకలి శ్రీనివాస్, మహేశ్వర్ రెడ్డి, మధుకర్ రెడ్డి, శ్రీనివాన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## ప్లాస్టిక్ కవర్ల వాడకంపై నిషేధం

**చేవెళ్ల, జూన్ 5, ప్రభాతవార్త :** ప్రభుత్వ నిబంధనల ప్రకారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలో ప్లాస్టిక్ కవర్ల వడకట నిషేధించడం జరుగుతుందని చేవెళ్ల మున్సిపల్ కమిషనర్ యాదగిరి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టేందుకు.. బేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్ కవర్లపై పూర్తిగా నిషేధం అమలులో ఉంటుందన్నారు. పట్టణ కేంద్రంలోని కిరాణా దుకాణాలు, కూరగయాల మార్కెట్లు, పంక్షన్ హాళ్లలో ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ నిబంధల ప్రకారం 120 మైక్రాన్లకంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లపై నిషేధం అమలుపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై భారీ జరిమానాలు విధించడంతో పాటు పదే తప్పిదాలకు పాల్పడితే దుకాణాల లైసెన్సులు కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు, వ్యాపారులు, ప్లాస్టిక్కు బదులుగా పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను వినియోగించి స్వచ్ఛమైన చేవెళ్ల పట్టణ నిర్మాణానికి సహకరించాలని కోరాడు.

## భవిష్యత్‌తరాలకు పచ్చని వాతావరణం

**ఘట్‌కేసర్, జూన్ 5, ప్రభాతవార్త:** ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని బిజెపిరాష్ట్రకార్యవర్గసభ్యులు-ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఘట్‌కేసర్ డివిజన్ చందుపట్లగూడ బాలాంజనేయస్వామి దేవాలయ ఆవరణలో శుక్రవారం 'మాకేనామ్-ఏక్‌పెడ్' (ఒక పేరు-ఒక చెట్టు) కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ బిజెపి అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డితో నాటు



బిజెపి నాయకులు మొక్కలు నాటి నీరు పోశారు. పర్యావరణాన్ని పరిరక్షించడం అందరి బాధ్యత అని, అభివృద్ధి పేరుతో పచ్చధనాన్ని కోల్పోకుండా సమతుల అభివృద్ధి దిశగా ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. 'మాకే నామ్-ఏక్ పెడ్' వంటి కార్యక్రమాలు కేవలం మొక్కలు నాటే కార్యక్రమం మాత్రమే కాదని ఇది భవిష్యత్ తరాలకు

## పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

**రాష్ట్ర పొల్యూషన్ బోర్డ్ సభ్యుడు చింపుల సత్యనారాయణ రెడ్డి**

**చేవెళ్ల, జూన్ 5, ప్రభాతవార్త :** పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులు చింపుల సత్యనారాయణ రెడ్డి తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ నగరంలోని ప్రభుత్వ కార్యాలయంలో రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యుల ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. దేశంలో రోజురోజుకు పెరుగుతున్న ప్లాస్టిక్ వాడకం తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని చెట్ల పెంపకం ద్వారా పర్యావరణ సమతుల్యత కాపాడబడటంతో పాటు భావితరాలకు స్వచ్ఛమైన జీవన వాతావరణం అందుతుందని పేర్కొన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ప్రజల చేతుల్లోనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్ర మండలి అధికారులు సిబ్బంది తదితరులు ఉన్నారు.

# భూములను రక్షించకుంటే మిగిలేది బూడిదే

**షాద్‌నగర్, జూన్ 5, ప్రభాతవార్త :** రియల్ ఎస్టేట్ వ్యాపారాల పేరుతో గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ భూములను ఆక్రమించి రైతులను రోడ్డున పడేస్తున్నారని, ఇప్పుడు ప్రభుత్వ భూములు, పేదలకు పంపిణీ చేసిన భూములపై కూడా కన్నేశారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం షాద్‌నగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 194651 మధ్య అమల్లోకి వచ్చిన రక్షి త కౌలుదారు చట్టం, ఆర్ఓఆర్ వ్యవస్థ ద్వారా రైతుల హక్కులు కాపాడబడ్డాయని ఆయన గుర్తు చేశారు. అనంతరం భూదానోద్యమం నేపథ్యంలో ప్రభుత్వం స్వీకరించిన భూములను నిరుపేదలకు పంపిణీ చేసిందని, ప్రస్తుతం అలాంటి భూములను కూడా నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్నారని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు సైతం తన భూమిని పేదల కోసం దానం చేశారని పేర్కొన్నారు.

**స్వామినాథన్ కమిటీ సూచనలు విస్మరణ**

2005లో స్వామినాథన్ కమిటీ సమర్పించిన నివేదికలో భూమిలేని వ్యవసాయ కుటుంబాలకు భూములు కేటాయించాలని, మహిళా సాధికారతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించిందన్నారు. పేదలకు ఇచ్చిన భూములను కొనుగోలు చేయకుండా, వ్యవసాయం చేయని వారు వ్యవసాయ భూములు కొనకుండా నియంత్రిస్తే రైతాంగం బలోపేతం అవుతుందని కమిటీ పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోనే సుమారు 40 శాతం మంది రైతులు తమ భూములను విక్రయించుకున్నారని, ఎలికట్ట పరిధిలో పేదలకు కేటాయించిన గైర్హాన్ భూములు కూడా పెద్దఎత్తున చేతులు మారాయని ఆరోపించారు.

**ధరణితోనే దరిద్రం..**

గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి విధానం కారణంగా లక్షల ఎకరాల భూములు అన్యాక్రాంతమయ్యాయని బక్కని నర్సింహులు ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు కేటాయించిన భూములు విక్రయించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పరిశ్రమలు, కంపెనీల పేరుతో పేదల భూములను స్వాధీనం చేసుకోవడం సరైన పద్ధతి కాదన్నారు.

**కాల్వలు, చెరువులు కూడా మాయమవుతున్నాయి**

భూములతో పాటు జలవనరులైన కాల్వలు, చెరువులు, కుంటలు, బండ్లబాటలు కూడా ఆక్రమణలకు గురవుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వనరులను పరిరక్షి ంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని, లేదంటే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వ భూములు, పేదల భూములు, జలవనరుల పరిరక్షణపై ప్రభుత్వం పట్టు బిగించి కఠిన చర్యలు తీసుకోవాలని బక్కని నర్సింహులు కోరారు.

## పట్టపగలే ఇంట్లో చోరి

**కుల్కచర్ల, జూన్ 5 ప్రభాతవార్త:** పట్టపగలే ఇంట్లో చోరి చేసి రూ 60 వేలు, 8 తూలాల వెండిని దొంగలించన ఘటన మండలంలోని పుట్టపహాడ్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ రమేష్ కుమార్ తెలిపినవివరాల ప్రకారం పుట్టపహాడ్ గ్రామానికి చెందిన బేతి మొగులయ్య భర్యతో కలిసి ఉపాధి హమి కూలికి పనికి వేళారు. ఉదయం 11 గంట సమంలో గుర్తు తెలియని వ్యక్తులు బైక్ పై వచ్చి తాళం వేసి ఉన్న బేతి మొగులయ్య తాళం పగల గొట్టి ఇంట్లోకి చోరబడ్డారు. గమనించిన బేతి మొగులయ్య చిన్న కుమారుడు రాహుల్ ఇంట్లోకి వెళ్లి చుసేందుకు వేళ్ల క్రమంలో రాహుల్‌కు కత్తి చూపి పరారయ్యారు. వెంటనే రాహుల్ తండ్రి మొగులయ్యఫోన్ చేయంతో కుల్కచర్ల పోలిస్టెషన్‌లో పిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకోని ఘటన స్థలానికి చేరుకుని సిసి కెమెరాలు, పరిసర ప్రాంతాల్లో పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## స్మశానవాటికలో గణేశ్ అభివృద్ధి పనులు

**ఘట్‌కేసర్, జూన్ 5, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లోని చెట్టేరుకుంట వద్ద ఉన్న స్మశానవాటిక అభివృద్ధికి మాజీ ఎంపిటిసి నందం గణేశ్ సహకరించారు. ఎవరైనా చనిపోతే శవాన్ని దహనవాటికలో దహనం చేయడానికి మెట్లు లేక ఇబ్బందికరంగా ఉండగా నందం గణేశ్ ముందుకు వచ్చి దహన వాటికకు మెట్లు నిర్మింప జేయిం చారు. అంత్య క్రియలకు వచ్చిన వారు ఎండకు, వానకు నిల బడి ఉంటూ ఇబ్బందులు పదు తుండే వారు. ప్రజలు వేచిఉం డేందుకు గణేశ్ షెడ్డు ఏర్పాటు చేయించారు. ఇటీవల చిన్నచెరువు వద్ద కూడా స్మశానవాటికను ఆయన అభివృద్ధి చేశారు. ఇళ్లు లేని పేదల కోసం అంతిమ సంస్కారాల అనంతరం ఉండేందుకు నీటిట్యాంకు కింద గది నిర్మించి అందులో అవసరమైన సౌకర్యాలు కల్పించారు. ఈసందర్భంగా స్మశానవాటికల అభివృద్ధికి సహకరిస్తున్న నందం గణేశ్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలియజేశారు.



## ప్రీప్రైమరీ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఆహ్వానం

**పూడూరు, జూన్ 5, ప్రభాతవార్త :** పూడూరు మండలం పరిధిలోని ప్రీప్రైమరీ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఇంస్ట్రక్టర్,ఆయా పోసులకు కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీచేయుటకు అభ్యర్థులను ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి సాయిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఎంపిపిఎస్ పూడూరు,మన్నెగూడ, కంకల్, సోమన్ గుర్తి, చెన్గోముల్ పాఠశాలల్లో ఒక్కో ఇంస్ట్రక్టర్,ఒక్కో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.ఇంస్ట్రక్టర్‌కు నెలవారి జీతం రూ.8000 ఉండగా,ఇంటర్, డిఈడ్,ఎర్లీచైల్డ్ హుడ్ ఎడ్యుకేషన్ (ఇసిఇ)కలిగిన మహిళా అభ్యర్థులు,ఆయాకు నెలవారి జీతం రూ.6000 ఉండగా 7వతరగతి ఉత్తీర్ణులైన మహిళా అభ్యర్థులు అర్హులని వివరించారు. స్థానికులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని,అయితే తహశీల్దారుచే జారీచేసిన స్థానిక ధృవీకరణ పత్రాన్ని అప్లికేషన్‌కు జతపరుచాలన్నారు.పైన పేర్కొన్న పాఠశాలల్లో పనిచేయుటకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 9వతేది ఉదయం 10గంటలకు మండల విద్యా వనరుల కేంద్రంలో సర్టిఫికెట్ల జిరాక్స్‌తో జతచేసిన అప్లికేషన్స్‌ను అందజేయాలని సూచించారు.

## ప్రీ ప్రైమరీ సూళ్ళలో ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

..మండల విద్యాధికారి నర్సింగ్‌రావు

**పెద్దేముల్, జూన్ 5, ప్రభాతవార్త:** పెద్దేముల్ మండలంలో ప్రీ ప్రైమరీ తరగతులు మంజూరైన ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో గౌరవ వేతనప్రాతిపదికన పనిచేయుటకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి నర్సింగ్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు జూన్ 9.2026 లోగా సంబంధిత పాఠశాలలో నిర్ణిత నమూనాతో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. దరఖాస్తులను సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సమర్పించాలన్నారు. అభ్యర్థుల ఎంపికలో మొదటగా ఆయా గ్రామము వారికి ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. ప్రీ ప్రైమరీ అను మతులు వచ్చిన పాఠశాలలు యంపిపిఎస్ మంబాపూర్, యం పిపిఎస్ కందనెల్లి, యంపిపిఎస్ ఇందూరు, యంపిపిఎస్ తట్టెపల్లి, యంపియుపిఎస్ గాజీపూర్ గ్రామాల్లోని అర్హత కలిగిన అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని యంఈఓ నర్సింగ్‌రావు కోరారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరం



సిఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బెలిదే రమేష్‌గుప్తా

**కీసర, జూన్5, ప్రభాతవార్త:**

ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరంగా మారిందని జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బెలిదే రమేష్‌గుప్తా తెలిపారు.శుక్రవారం కీసర సర్కిల్ పరిధిలోని వన్నిగూడ గ్రామానికి చెందిన నరేష్‌కి 35 వేల రూపాయల చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిజంగా అర్హులైన పేదలకు చేరాలన్నారు. అనారోగ్యం, ప్రమాదాలు, ఆర్థిక ఇబ్బందులతో ఇబ్బంది పడుతున్న పేద కుటుంబాలకు సీఎం సహాయనిధి ఎంతో ఊరటనిస్తుందని పేర్కొన్నారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమ సమస్యలను ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.భవిష్యత్తులో కూడా ప్రజలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కీసర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జూపల్లి రవీందర్,నాయకులు చర్లపల్లి క్రిష్ణారెడ్డి,ముత్యాలు,వెంకటేషన యాదవ్,ప్రవీణ్,వెంకటేష్ చారీ, మల్లేష్,రాజు తదితరులు పాల్గొన్నారు.

## వర్కింగ్ జర్నలిస్టు పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ

- ప్రైవేటు పాఠశాలలకు రంగారెడ్డి జిల్లా డిఇఒ ఉత్తర్వులు జారీ

**ఇబ్రహీంపట్నం, జూన్ 5, ప్రభాతవార్త :** ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకునే వర్కింగ్ జర్నలిస్టుల పిల్లల ఫీజుల్లో 50 శాతం రాయితీ ఇవ్వాలని రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి డీఈఓ ఎస్. వెంకటేశ్వర్లు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ప్రైవేటు పాఠశాలల్లో పిల్లల చదువులకు ఫీజులు భారంగా మారాయని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షులు ఎండి సలీమ్ పాషా నేతృత్వంలోని బృందం గురువారం జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డితో పాటు డిఇఒ దృష్టికి తీసుకెళ్లారు. జర్నలిస్టుల మెమోరాండం ఆధారంగా స్పందించిన డిఇఒ వెంకటేశ్వర్లు, ప్రస్తుతం అమల్లో ఉన్న ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఈ ఫీజు రాయితీని పొడిగిస్తూ నిర్ణయం తీసుకుని శుక్రవారం ఉత్తర్వు కాపీలను జిల్లా అధ్యక్షులు సలీమ్ పాషాతో పాటు జిల్లాలోని అన్ని మండలాల ఎంఈఓలకు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు అందించారు. ఈ ఉత్తర్వుల ప్రకారం, రంగారెడ్డి జిల్లా పరిధిలోని ప్రైవేట్ స్కూళ్లన్నీ జర్నలిస్టుల పిల్లల ఫీజుల్లో 50 శాతం మినహాయింపు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఈ రాయితీ పొందాలనుకునే జర్నలిస్టులు తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన తమ అక్రిడిటేషన్ కార్డును పాఠశాల యాజమాన్యాలకు చూపించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణ రెడ్డికి, అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డికి, డిఇఒ వెంకటేశ్వర్లుకు జిల్లా అధ్యక్షులు సలీమ్ పాషా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులు ఎంఈఓలు అందరూ ఈ ఆదేశాలను తమ పరిధిలోని ప్రైవేట్ పాఠశాలలకు వెంటనే చేరవేసి, క్షేత్రస్థాయిలో ఖచ్చితంగా అమలయ్యేలా చూడాలని డిఇఒ తన ఉత్తర్వుల్లో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మారాటీ రవి, జర్నలిస్ట్ నాయకులు కరుణాకర్, భాస్కర్, భార్గవ్, శ్రీనివాస్, శివ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతిని కాపాడటం మన అందరి బాధ్యత

వ్యవసాయ కళాశాల డీన్ నారాయణ రెడ్డి

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 5, ప్రభాత వార్త:** ప్రకృతిని కాపాడాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని అనురాగ్ వ్యవసాయ యూనివర్సిటీ కళాశాల డీన్ నారాయణ రెడ్డి అన్నారు. అనురాగ్ వ్యవసాయ యూనివర్సిటీలో శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని ప్రకృతి స్ఫూర్తిగా వాతావరణం కోసం మన భవిష్యత్తు కోసం అనే థీమ్‌తో ఎన్ఎస్ఎస్ సెల్ యూనిట్ 7 ఆధ్వర్యంలో బిస్లెరీ, బాటిల్స్ ఫర్ చేంజ్ సహకారంతో కళాశాల ఆవరణలో భారీ అవగాహన పరిశుభ్రత కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ, స్థిరమైన జీవన విధానాలు, వ్యర్థాల నిర్వహణ, భావితరాల కోసం ప్రకృతి వనరులను సంరక్షించాల్సిన బాధ్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సెల్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ సి. మల్లేశ్, ఎన్ఎస్ఎస్ యూనిట్ 7 ప్రోగ్రామ్ ఆఫీసర్ పి. దివాకర్ రెడ్డి, అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ సౌరభ్ బార్పుటే, ట్రైనర్ టి. విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## సాయిగీతాశ్రమంలో ఆస్తమా ఉచిత ఆయుర్వేద శిబిరం

**మేడ్చల్, జూన్ 5. ప్రభాతవార్త :** మృగశిర సందర్భంగా గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధి కండ్లకోయ శివారులో గల సాయి గీతాశ్రమంలో ఉచిత ఆస్థమా వైద్య శిబిరం నిర్వహించనున్నామని ఆశ్రమ నిర్వహకులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిబిరం ముఖ్యంగా ఆస్థమా, శ్వాస సంబంధిత సమస్యలు ఉన్నవారి కోసం ఏర్పాటు చేయబడిందని, మృగశిర రోజు ఇచ్చే ప్రత్యేక మందును తీసుకోవడం వల్ల, ఆస్థమా లాంటి సమస్యల నివారణకు ఉపశమనం లభిస్తుందని నమ్మకం ఉందని తెలిపారు. ఈ నెల 8వ తేదీ మధ్యాహ్నం 1. 30 గంటల నుండి రాత్రి 8:00 గంటల వరకు అదే విధంగా 9వ తేదీన ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు శిబిరం నిర్వహించబడుతుందని, ఆస్థమా సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అరుదైన అవకాశాన్ని వినియోగించుకొని ఆరోగ్య ప్రయోజనాలను పొందాలని కోరారు.

# పాఠశాల అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేయాలి

..మెరుగైన విద్యాప్రమాణాలు, వసతులు కల్పించడమే లక్ష్యం

....రాష్ట్ర విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసచారీ

**పెద్దేముల్, జూన్ 5, ప్రభాతవార్త:** విద్యార్థులకు మెరుగైన విద్యాప్రమాణాలు, వసతులు కల్పించడమే లక్ష్యమని విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసచారీ అన్నారు. శుక్రవారం పెద్దేముల్ మండలం గొట్టపల్లి మాడల్‌స్కూల్‌ను రాష్ట్ర విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసచారీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో నూతనంగి నిర్మాణం చేపడుతున్న హస్టల్ భవన పనులను ఆయన నిశితంగా పరిశీలించారు. భవన నిర్మాణ నాణ్యత ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ గాయత్రితో భేటి అయి పాఠశాలలోని పలు విద్యా విషయాలు, వసతులపై వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసచారీ మాట్లాడుతూ హస్టల్ భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం కలిసి కట్టుగా పనిచేసి పాఠశాల అభివృద్ధికి కృషిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ఉన్నతాధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న విద్యాశాఖ డైరెక్టర్

# ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల నిరసన

**కీసర, జూన్5, ప్రభాతవార్త:**

కీసర సర్కిల్ పరిధిలోని కీసర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద ధాన్యం కొనుగోలు చేయడం లేదని శుక్రవారం రైతులు ఆందోళనకు దిగారు.ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద అధికారుల తీరును నిరసిస్తూ నిరసన వ్యక్తం చేశారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి తిరుగుతున్నా ధాన్యం కొనుగోలు చేయడం లేదని ఆగ్రహం వక్తం చేశారు.వరి కోతలు చేపట్టి సుమారు నెల రోజులు అవుతున్నా టోకన్లు తీసుకున్న వారికి ఇప్పటి వరకు ఖాళీ బస్తాలు ఇవ్వలేదన్నారు.ఇప్పటికే వర్షాలు పడి ధాన్యం తడిసిందని,ధాన్యాన్ని ఎండబెట్టి తీసుకువచ్చామని మరలా ధాన్యం వర్షాలకు తడిస్తే ధాన్యం చెతికి రాకుండా పోతుందన్నారు.మరోవైపు ధాన్యం కొనుగోలు ఆలస్యం కావడంతో ట్రాక్టర్లలో నింపి తీసుకువచ్చిన ధాన్యం బస్తాలు వారం రోజులుగా కొనుగోలు కేంద్రం వద్ద ఉన్నాయన్నారు.అద్దెకు తీసుకువచ్చిన ట్రాక్టర్లకు రోజుకు 2 వేల రూపాయలు అద్దె చెల్లించాల్సి వస్తుందన్నారు.అధికారులను అడిగితే లారీలు రాకపోవడంతో వడ్లు ఖాళీ అవడం లేదని సమయానికి లారీలు వస్తే ధాన్యం నిలువ ఉండదని చెబుతున్నారని తెలిపారు.ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి ధాన్యం కొనుగోలులో జాప్యం జరుగకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# ఆర్‌ఒబిని గిన్నిస్‌రికార్డుకు ఎక్కించాలి

17 ఏళ్లుగా కార్యరూపం దాల్చకపోవడంతో వినూత్న నిరసన

**ఘట్‌కేసర్, జూన్ 5, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో నిర్మాణంలో ఉన్న రైల్వేవంతెన పనులు దాదాపు 17 సంవత్సరాలు గడిచినా పూర్తి కాకపోవడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనేపథ్యంలో ఆర్‌ఓబి నిర్మాణ పనుల్లో అసాధారణ జాప్యాన్ని ప్రపంచ రికార్డుగా నమోదు చేయాలని కోరుతూ లండన్‌లోని గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌కు వినతిపత్రాన్ని పంపించారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు-ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో జేఏసీ కన్వీనర్ మారం లక్ష్మారెడ్డితో కలిసి ఘట్‌కేసర్‌లోని తపాలా కార్యాలయం నుంచి గిన్నిస్‌రికార్డ్స్‌కు లేఖను పంపించారు. సికింద్రాబాద్-ఖాజీపేట్ రైలుమార్గంలో ఘట్‌కేసర్ రైల్వేగేటు (ఎల్‌సి నెం.15)పై వంతెన నిర్మాణానికి 2009 ఫిబ్రవరి 11న అప్పటి తెలంగాణ ప్రభుత్వం పరిపాలనా అనుమతి మంజూరు చేసిందని తెలిపారు. 2013లో రూ.39 కోట్ల అంచనా వ్యయంతో 527.6 మీటర్ల పొడవుతో ఈఆర్‌ఓబి ప్రాజెక్టును చేపట్టగా 13 సంవత్సరాలు గడుస్తున్నా ఇంకా పనులు పూర్తి కాలేదని దీంతో ఘట్‌కేసర్-శామీర్‌పేట్, హైదరాబాద్ పరిసర ప్రాంతాల ప్రజలు ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులకు గురవుతుండగా రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఈవంతెన నిర్మాణ సమయంలో అధికారంలో ఉన్న మంత్రి, ఎమ్మెల్యేలుగా పనిచేసిన వారితో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంట్రాక్టర్లకు గిన్నిస్ రికార్డ్స్‌లో స్థానం కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రజాసమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని ఘట్‌కేసర్ ప్రాంత ప్రజలకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని సుదర్శన్‌రెడ్డి మరోసారి స్పష్టం చేశారు.

ఈకార్యక్రమంలో బిజెవైఎం అధ్యక్షులు కొమ్మిడి విక్రాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షులు అనిల్‌గౌడ్, శ్రీకాంత్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లంపేట మున్సిపాలిటీలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం

**మేడ్చల్, జూన్ 5, ప్రభాతవార్త :**

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎల్లంపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీదేవి కౌన్సిలర్లతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో, గాలినాణ్యతను మెరుగుపరచడంలో, జీవవైవిధ్యాన్ని రక్షి ంచడంతో పాటు వాతావరణ మార్పులను అరికట్టడంలో చెట్లు కీలక పాత్ర పోషి స్తాయని చెప్పారు. మన మున్సిపాలిటీని మరింత పచ్చగా, ఆరోగ్యకరంగా మార్చడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని తమ వంతు సహకారాన్ని అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ రజిత, కౌన్సిలర్లు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

## మేడ్చల్‌లో ఎస్ఎస్ బేకరీలో చోరీ

నగదు, ల్యాప్‌టాప్ అవహరణ

**మేడ్చల్, జూన్ 5. ప్రభాతవార్త :** మేడ్చల్ పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో గల ఎస్ఎస్ బేకరీలో జరిగిన చోరీ స్థానికంగా కలకలం రేపింది. స్థానికుల సమాచారం మేరకు, మేడ్చల్ హైవేపై వివేకానంద విగ్రహం పక్కనే ఉన్న ఎస్ఎస్ బేకరీ వెనుక భాగంలోని తాళాలను పగులగొట్టి దొంగలు లోపలికి చొరబడ్డారు. అనంతరం బేకరీలో ఉన్న సుమారు రూ.60 వేల నగదు, ఒక ల్యాప్‌టాప్, చాక్లెట్ డబ్బాలు, ఇతర విలువైన వస్తువులను దొంగిలించి పరారయ్యారు.ప్రధాన రహదారిపై, ఎప్పుడూ రద్దీగా ఉండే ప్రాంతంలో ఉన్న ఎస్ఎస్ బేకరీలో చోరీ జరగడం స్థానిక వ్యాపారులు, ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ప్రజల రాకపోకలు అధికంగా ఉండే ప్రాంతంలోనే దొంగలు ఇంత ధైర్యంగా చోరీకి పాల్పడడం భద్రతా పరిస్థితులపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.ఇటీవలి కాలంలో మేడ్చల్ పట్టణంలో పోలీసుల పహారా తగ్గిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. రాత్రి వేళల్లో గస్తీ బలహీనపడటమే ఇలాంటి ఘటనలకు కారణమవుతోందని పలువురు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.ఈ ఘటనపై ఎస్ఎస్ బేకరీ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తూ దర్యాప్తు చేపట్టారు.స్థానిక వ్యాపారులు, ప్రజలు మేడ్చల్ పట్టణంలో రాత్రి పూట పోలీసు గస్తీని మరింత పెంచి, చోరీల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## ప్రైవేటు విద్యాసంస్థల బస్సుల తనిఖీ



బస్సును తనిఖీ చేస్తున్న మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్

**షాద్‌నగర్, జూన్ 5, ప్రభాతవార్త :** నూతన విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సి. స్వప్న ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలకు సూచించారు. ఈ నేపథ్యంలో షాద్‌నగర్ పరిధిలోని పలు ప్రైవేటు పాఠశాలల బస్సులను అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. తనిఖీల సందర్భంగా బస్సుల ఫిట్‌నెస్, బ్రేకులు, టైర్లు, అత్యవసర ద్వారాలు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, అగ్నిమాపక పరికరాలు తదితర భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. విద్యార్థులను రవాణా చేసే వాహనాలు పూర్తి స్థాయి ఫిట్‌నెస్ నిబంధనలకు అనుగుణంగా ఉండాలని, చిన్నపాటి నిరక్ష ్యంల్లో కూడా ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని స్వప్న హెచ్చరించారు. పాఠశాలల యాజమాన్యాలు బస్సుల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రభుత్వం నిర్దేశించిన రవాణా భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. విద్యార్థుల సురక్షి త ప్రయాణమే ప్రధాన లక్ష ్యమని, నిబంధనలను ఉల్లంఘించే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణతోనే భావితరాలకు భద్రమైన భవిష్యత్

మల్లారెడ్డిగూడ సర్పంచ్ అమీర్పేట సబితా గోవర్ధన్‌రెడ్డి

**షాబాద్:** పర్యావరణ పరిరక్షణతోనే భావితరాలకు భద్రమైన భవిష్యత్ ఏర్పడుతుందని మల్లారెడ్డిగూడ గ్రామ సర్పంచ్ అమీర్పేట సబితా గోవర్ధన్ రెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం గ్రామంలో నిర్వహించిన"స్వచ్ఛ గావ్ - సురక్షి త్ జలవాయు-2026" కార్యక్ర మంలో ఆమె పాల్గొని మొక్కలు నాటారు.



మొక్క నాటుతున్న గ్రామ సర్పంచ్ అమీర్పేట సబితా గోవర్ధన్ రెడ్డి.

పర్యావరణ సమతుల్యతను కాపాడేం దుకు ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని ఆమె పిలుపు నిచ్చారు. చెట్లు ప్రకృతికి ప్రాణవాయువులని, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడంలో వాటి పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు నీటి వనరులను సంరక్షి ంచడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు అందరూ సహకరించాలని కోరారు. గ్రామాభివృద్ధితో పాటు పచ్చదనాన్ని పెంపొందించేందుకు గ్రామపంచాయతీ ప్రత్యేక చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు, గ్రామ ప్రజలు, యువత, మహిళలు, ప్రజాప్రతినిధులు పాల్గొని మొక్కలు నాటారు.

## సీతారాంపూర్ గ్రామ విలేజ్ మ్యాప్ సర్వే చేయాలి

**షాబాద్, జూన్ 5, ప్రభాతవార్త :** మండల పరిధిలోని సీతారాంపూర్ గ్రామానికి సంబందించిన విలేజ్ మ్యాప్, గ్రామ కంఠం భూమిని సర్వే నిర్వహించి ఇవ్వాలని సర్పంచ్ పావనిచెన్నయ్య శుక్రవారం తహసీల్దార్ అన్వర్ కు వినతి ప్రతం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధి, భూరికార్డుల స్పష్టత మరియు ప్రజలకు అవసరమైన పరిపాలన సౌకర్యాల దృష్ట్యా గ్రామ కంఠం భూములను సర్వే చేసి అధికారిక విలేజ్ మ్యాప్ను ఖీగ్రామపంచాయితీకి అందజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రాజు, మణి, ఆంజనేయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మల్లారెడ్డిగూడలో పశుగ్రాస విత్తనాలను అందజేస్తున్న డాక్టర్ అంజుబసేరా

# స్పీకర్ జన్మదినం పురస్కరించుకొని నోటుపుస్తకాలను పంపిణీ

**మోమిన్‌పేట్, జూన్ 5, ప్రభాతవార్త:** గురువారం రోజు తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకొని వికారాబాద్‌లో మండల పార్టీ అధ్యక్షులు శంకర్ యాదవ్, మార్కెట్ కమిటి చైర్మెన్ మహెందర్ రెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు కోస్గి సురెందర్ ల ఆద్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పిల్లలకొరకు ఆయన చేతులమీదుగా నోటు పుస్తకాలను డిసిసి ప్రధాన కార్యధర్శి వారాల సిరాజుద్దీన్ పంపిణి చేశారు. ఈ సందర్భంగా సిరాజుద్దీన్ మాట్లాడుతు జనవృదయనేత, నిత్యం ప్రజలకొరకు, వికారాబాద్ ప్రాంత అభివృద్ది కొరకు పనిచేసే అసలు సిసలైన నాయకుడు గడ్డం ప్రసాద్‌కుమార్ ఆదేశాల మేరకు శాలువాలు, బొక్కేలు, పూలదండలకు బదులుగా పిల్లలకు నోటుపుస్తకాలు ఇవ్వాలని అన్నందునా పంపిణి చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాద్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, మహమ్మద్ హాజీ, వార్డు సభ్యులు మహమ్మద్ అప్సర్, కాంగ్రేస్ యువజన నాయకులు మహమ్మద్ తాజ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ప్రసాద్‌కుమార్‌న జన్మదినాన్ని పురస్కరించుకొని నోటుపుస్తకాలను అందజేస్తున్న సిరాజుద్దీన్.



నాగారంలో పర్యావరణ దినోత్సవంలో పాల్గొన్న మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

## మొక్కలు నాటండి.. ప్రాణవాయువు పెంచండి

**కీసర, జూన్5, ప్రభాతవార్త :** జీవకోటికి ప్రాణవాయువును ఇచ్చేది మొక్కలేనని అందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు.ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం డివిజన్ రాంపల్లి భరత్‌నగర్ కాలనీలో నాగారం డివిజన్ బిజెపి అధ్యక్షులు కొండబోయిన నాగరాజు ఆద్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా,ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని "ఏక్ పేడ్ మా కే నామ్" కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటడం జరిగింది.ఈ సందర్భంగా మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం 12 సంవత్సరాలు దిగ్విజయంగా పూర్తి చేసుకుని భారతదేశాన్ని అన్ని విధాలుగా ముందుకు తీసుకువెళుతుందని తెలియజేశారు.ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటూ సుపరిపాలన,ప్రజల శ్రేయస్సు,దేశ భద్రత మరియు సమైక్యతకు ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు.పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని తెలిపారు.పర్యావరణాన్ని కాపాడితే ఆ పర్యావరణం మనకు ఎల్లప్పుడూ అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు.ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని చెట్లను పెంచాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి,రాష్ట్ర పంచాయతీ రాజ్ సెల్ కోకన్వీనర్ మునుగంటి సురేష్,మేడ్చల్ రూరల్ జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్,లక్ష్మీ,జిల్లా ఉపాధ్యక్షులు గణపురం శ్యాంసుందర్,బొమ్మిడి బుచ్చిరెడ్డి,మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్,జిల్లా కార్యదర్శి బోడ శ్రీనివాస్‌రావు,కీసర మండల డివిజన్ అధ్యక్షులు కోల బాలరాజు యదవ్,నాగారం డివిజన్ ప్రధాన కార్యదర్శులు మామిడి జంగారెడ్డి,పోతంశెట్టి వెంకటేశ్వరావు,ఏనుగు మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు వల్లల శ్రీనివాస్‌గౌడ్,రామారం గిరిగౌడ్,కార్యదర్శులు సురేందర్‌రెడ్డి,సతీష్‌రెడ్డి,భరత్‌రెడ్డి కాలనీ అధ్యక్షులు మల్లారెడ్డి,నాయకులు నక్క కిషోర్‌గౌడ్,రామారం మహేందర్‌గౌడ్,కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటుదాం... ప్రకృతిని కాపాడుదాం...

**కీసర, జూన్5, ప్రభాతవార్త:**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కీసర సర్కిల్ డివిజన్ బిజెపి పార్టీ అధ్యక్షులు కోల బాలరాజు యాదవ్ అన్నారు.శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్రమోడీ 12 సంవత్సరాల సుపరిపాలన సందర్భంగా "మాకే నామ్ పర్ ఏక్ పెడ్" కార్యక్రమాన్ని కీసర డివిజన్ పరిధిలోని తిమ్మాయి పల్లి గ్రామంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతిని రక్షించడం అంటే మన భవిష్యత్తును కాపాడుకోవడమేనని పేర్కొన్నారు.వాతావరణ మార్పులు పెరుగుతున్న కాలుష్యం తగ్గిపోతున్న అటవీ సంపద వంటి సవాళ్లను ఎదుర్కోవాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం వాటిని సంరక్షించడం అలవాటు చేసుకోవాలని సూచించారు."చిన్న చర్యలు పెద్ద ప్రభావం" అనే సందేశంతో ప్రజలు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం,పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం,రీసైక్లింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వడం వంటి చర్యలను పాటించాలని కోరారు.ప్రతి ఇంటి వద్ద కనీసం ఒక మొక్కను నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని పిలుపు నిచ్చారు.పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వ సంస్థలు మాత్రమే కాకుండా భవిష్యత్తు తరాలకు పరిశుభ్రమైన ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడం మనందరి బాధ్యత అని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి,జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌రావు,జిల్లా నాయకులు అశోక్,మెట్టు క్రిష్ణ యాదవ్,డివిజన్ ప్రధాన కార్యదర్శి నల్ల వెంకట్‌రెడ్డి, నాయకులుజంగాలు, శ్రీశైలం, మల్లారెడ్డి ,సత్యనారాయణ ,మహేందర్ యాదవ్,పవన్‌గౌడ్,నర్సింహ్మా,ఉమారెడ్డి, మల్లేష్,సందీప్,మధు,నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



తిమ్మాయిపల్లి గ్రామంలో మొక్కలు నాటుతున్న కీసర సర్కిల్ బిజెపి పార్టీ అధ్యక్షులు కోల బాలరాజు యాదవ్

## నాట్యకళ అవార్డ్సుకు ఎంపికైన ఎస్.కె డాన్స్ చిన్నారులు

**యాచారం, జూన్5, ప్రభాతవార్త:**

మహబూబ్ నగర్ శిల్పారామంలో తిరుపతి రాజు కొరియోగ్రాఫర్ సైడ్ డ్యాన్స్ స్టూడియో ఆధ్వర్యంలో స్టేట్ లెవెల్ నాట్యా కళా అవార్డ్స్, కాంపిటీషన్ నిర్వహించడం జరిగింది. కాంపిటీషన్లో యాచారం మండలం కేంద్రంలో గల ఎస్ కె డాన్స్ స్టూడియో నుండి పాల్గొన్న తొమ్మిది మంది విద్యార్థులు అందులో ఎన్నికయ్యారు. కార్యక్రమానికి చీఫ్ గెస్ట్ గా వచ్చిన 13 ప్రసాద్ మాస్టర్ కార్తీక్ మాస్టర్ సాయి మాస్టర్ అందరూ ముందుగా యాచారం ఎస్.కె డాన్స్ స్టూడియో చిన్నారులకు మొదట ప్రాధాన్యతనిచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిల శ్రీనీత శశిధర్ తమన్ శ్రావ్యా అక్షర అవంతిక తదితరులు పాల్గొని ఉత్తమ ప్రతిభను ప్రదర్శించారు.

## పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

సర్పంచ్ గడ్డం వెంకటయ్య

**కుల్కచర్ల, జూన్ 5 ప్రభాతవార్త:** పర్యావరణ పరిక్షణకు కృషి చేయాలని సర్పంచ్ గడ్డం వెంకటయ్య పేర్కొన్నారు.శుక్రవారం మండల పరిధిలోని పిరంపల్లి గ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొనిప్రభుత్వ పాఠశాలల్లో స్థానిక నాయకులతో కలిసి మొక్కలు నాటి నీరు పోసి మాట్లాడారు.. పర్యావరణ పరిక్షణకు ప్రధాన్యత ,గ్రామ పరిశుభ్రత,మొక్కల పెంపకం ,ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ,సహజ వనరుల సంరక్షణ వంటిఅంశాలపై విస్తృతంగా చర్చించారు. పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడం ప్రతి పౌరుడిబాధ్యత అన్నారు. ఈ కార్య క్రమంలో పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్ రెడ్డి,ఉప సర్పంచ్ శాంత మొగులయ్య,వార్డు సభ్యులు శ్రీలత శ్రీశైలం,లక్ష్మి,కిష్టమ్మ ,ఫీల్డ్అసిస్టెంట్ వెంకటయ్య,సినియర్ నాయకులు రమేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న నేతలు

## కుటుంబ కలహాల నేపథ్యంలో వ్యక్తి ఆత్మహత్య

**జవహర్ నగర్, జూన్ 5.ప్రభాత వార్త:**

జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో భార్యాభర్తల మధ్య కొనసాగుతున్న కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా జిలేడ్ చౌదరిగూడ మండలం పద్మారం గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు, ఆమె కుమారుడు ప్రకాష్ తన భార్య లక్ష్మి ్మ, పిల్లలతో కలిసి ఎల్లారెడ్డిగూడలో నివాసం ఉంటున్నాడు.

గత రెండేళ్లుగా భార్యాభర్తల మధ్య తరచూ కుటుంబ కలహాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదే కారణంగా గతంలో ఒకసారి ఆత్మహత్యాయత్నం చేయగా, కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడినట్లు తెలిసింది.జూన్ 4వ తేదీ సాయంత్రం సుమారు 7.50 గంటలకు ప్రకాష్ తన తమ్ముడు బస్వరాజ్‌కు ఫోన్ చేసి భార్యాభర్తల మధ్య జరిగిన గొడవ విషయాన్ని తెలిపాడు.

అనంతరం బస్వరాజ్ ఆ విషయాన్ని తన సోదరి గౌరికి తెలియజేశాడు. గౌరి ప్రకాష్‌కు పలుమార్లు ఫోన్ చేసినప్పటికీ స్పందన రాలేదు. దీంతో ప్రకాష్ ఇంటి ఎదురుగా నివసించే సుప్రియను సంప్రదించగా, ఇంట్లో కుక్కను కట్టివేసే బెల్ట్‌తో ఉరివేసుకున్నట్లు తెలిపింది.వెంటనే కుటుంబ సభ్యులు, స్థానికులు ప్రకాష్‌ను సమీపంలోని ఆసుపత్రికి తరలించగా, రాత్రి సుమారు 8.50 గంటలకు వైద్యులు పరీక్షి ంచి మృతుడిగా నిర్ధారించారు.ఈశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భార్యాభర్తల మధ్య కలహాల కారణంగానా లేదా ఇతర కారణాల వల్లనా ఆత్మహత్యకు పాల్పడ్డాడనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కను నాటి నీళ్లుపోస్తున్న సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వాణి తదితరులు

## మొక్కలు వలన భవిష్యత్తు తరాలకు మంచి వాతావరణంన

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 5, ప్రభాత వార్త:** ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఘట్‌కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వాణి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పోచారం డివిజన్ పరిధిలోని అన్నోజిగూడ శ్మశాన వాటికలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పచ్చదనం పెంపొందుతుందని అన్నారు. మొక్కలు నాటడం ద్వారా భవిష్యత్తు తరాలకు మంచి వాతావరణాన్ని అందించినవాళ్లం అవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఈ బి. చంద్రశేఖర్, డిప్యూటీ మేనేజర్ బి. శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శిగా కొంకాని విజయ్ కుమార్

**- నియామక పత్రం అందజేసిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ**

**ఇబ్రహీంపట్నం, జూన్ 5, ప్రభాతవార్త :** ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొంకాని విజయ్ కుమార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితుల య్యారు. హైదరాబాద్‌లో టిపిసిసి ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందు కున్నారు. ఈ సందర్భంగా కొంకాని విజయ్ కుమార్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ గౌడ్, రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఎస్సీ సెల్ చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రత్యేక ప్రోత్సాహం వల్లే తనకు ఈ అవకాశం దక్కిందని, నియోజకవర్గంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి నాయకత్వంలో పార్టీ బలోపే తానికి, క్షేత్రస్థాయిలో దళితుల సంక్షేమానికి శాయశక్తులా కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, రైతుబంధు వంటి ప్రతిష్టాత్మక సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని విజయ్ కుమార్ చెప్పారు. ఇప్పటికే మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే రెండో విడత పంపిణీతో పాటు అర్హులందరికీ పింఛన్ల అందజేత ఉంటుందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను విజయ వంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి భైరిక రమాకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టిపిసిసి ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చేతుల మీదుగా నియామక పత్రం అందుకుంటున్న కొంకాని విజయ్ కుమార్

## పర్యావరణ పరిరక్షణ భావితరాలకు మనం అందించే గొప్ప సంపద

**కేశంపేట, జూన్ 5 ,ప్రభాతవార్త :**

పర్యావరణ పరిరక్షణ భవిష్యత్ తరాలకు మనం అందించే గొప్ప సంపద అని చింతకుంటపల్లి, సంగెం చింతకుంటపల్లి గ్రామాల సర్పంచులు రమేష్ యాదవ్, వేణుగోపాల చారి అన్నారు. ఈ సందర్భంగా సర్పంచులు మాటా ్లడుతూ ప్రపంచ పర్యావరణం దినోత్సవం సందర్భంగా ఆయా గ్రామాలలో మొక్కలు నాటి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో, చింత కుంటపల్లి పంచాయతీ కార్యదర్శి మురళి, యూత్ సభ్యులు కుమ్మరి రాజు, కొండల్ రెడ్డి, చరణ్,మల్లేష్ యాదవ్, మధు,శ్రీకాంత్ మై భరత్ ప్రతినిధి శ్రీశైలం, సంగెం ఉపసర్పంచ్ మహమ్మద్ షకీల్, పంచాయతీ కార్యదర్శి గోల్కొండ సందీప్ మరియు గ్రామాల మహిళలు యువకులు తదితరులు పాల్గొన్నారు.



జడ్చర్ల సభకు తరలివెళ్తున్న కాంగ్రెస్ శ్రేణులు

## సిఎంసభకు భారీగా తరలిన కాంగ్రెస్ శ్రేణులు

**కేశంపేట, జూన్ 5, ప్రభాతవార్త :**

పాలమూరు సాగునీటి ప్రాజెక్టుల వేగవంతమే లక్ష ్యంగా మెహబూబ్ నగర్ జిల్లా జడ్చర్లలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ సభకు కేశంపేట మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రమేష్, మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి, వీరేశం, బీస కరుణాకర్ రెడ్డి, జగదీశ్వరప్ప, మండల కాంగ్రెస్ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. జడ్చర్ల గంగాపూర్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఈ భారీ ప్రదర్శన బహిరంగ సభలో కాంగ్రెస్ శ్రేణులు సరికొత్త ఉత్సాహం నెలకొందని తెలిపారు .ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సాగుతున్న ఇందిరమ్మ రాజ్యంలో సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని మరింత బలోపేతం చేస్తామని ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ కమిటీ ప్రతినిధులు వివిధ గ్రామాల సర్పంచులు వార్డు సభ్యులు అనుబద్ధ సంఘాల సభ్యులు మండల కాంగ్రెస్ కుటుంబ సభ్యులు నాయకులు మరియు కార్యకర్తలు పాలమూరు ప్రాజెక్టు సాధన లక్ష ్యంగా ప్రజా ప్రభుత్వ పాలనలో సీఎం రేవంత్ రెడ్డి, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అడుగుజాడల్లో ముందుకు సాగుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గూడ వీరేశం, జగదీశ్వరప్ప కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు గుండె రాణి, బీస కరుణాకర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, శ్రవణ్ రెడ్డి, అనసూయ, కోడూరు నర్సింలు, రావుల పెంటయ్య ముదిరాజ్, జంగయ్య, రమణ గౌడ్, పందు గౌడ్,మల్లేష్, జంగయ్య, మండల పరిధిలోని గ్రామాల నుంచి భారీగా తరలిన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రొపెసర్ జయశంకర్ బడిబాటలో ఉపాధ్యాయులు

**దోమ, జూన్ 5, ప్రభాతవార్త :**ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు ఉన్నందున విద్యను అభ్యసించాలని దోమమండల విద్యాధికారి వెంకట్ అన్నారు.ప్రొపెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమములో బాగంగా శుక్రవారం నాడు దోమ మండల పరిదిలోని దిర్సంపల్లి బడెంపల్లి తాండ గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్బముగ ఆయనమాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మద్యాహ్న బోజనం,టెస్టబుక్,నోట్‌బుక్,బ్యాగ్‌లు ,యూనిఫారం,అల్పాహారం, అందించడము జరుగుతుందని తెలిపారు.వీటితో పాటు అనుభవులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన చేయడంజరుగుతందని అన్నారు.మండలములోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులందరు బడిబాట కార్యక్రమములో పాల్గొనాలని సూచించారు.పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచి ఉన్నత విద్యను అందించుటకు ప్రధానోపాద్యాయులు,ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమములో బడెంపల్లి సర్పంచ్‌శంకర్‌నాయక్,దిర్సంపల్లి సర్పంచ్ విజయలక్ష్మివెంకట్ రాములు,ప్రదానోపాద్యాయులు కేశవులు,తిర్మలేశ్, సిఆర్‌పి రెడ్యా నాయక్, ఉపాద్యాయ బృందం గోరిబేగం,సతీష్,బాలు ,గోపాల్, నారాయణ,వెంకట్‌దాస్,శేఖర్,గ్రామస్తులు పాల్గొన్నారు.

# విరబూసిన 'మే' ఫ్లవర్

## కనువిందు చేస్తున్న మే పుష్పాలు

**ఘట్‌కేసర్, జూన్ 4, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ డివిజన్ ఎన్ఎఫ్‌సీనగర్‌లో అరుదైన మే ఫ్లవర్ పుష్పాలు విరగబూసాయి. ప్రతి సంవత్సరం మే నెలలో ఇక్కడ ఎరుపు రంగులో పుష్పాలు వికసించి కనువిందు చేస్తాయి. ఎన్ఎఫ్‌సీ కంపెనీ విశ్రాంత ఉద్యోగి ఆలపాటి మల్లికార్జునరావు తన ఇంటి ఆవరణలో వివిధ రకాల పూలు, పండ్ల చెట్లను పెంచుతున్నారు. ఆయన పెరట్లో పెరిగిన పూల మొక్కలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. వాటిలో దుంప జాతికి చెందిన మే ఫ్లవర్ సంవత్సరానికి ఒక్కసారే పూసే పువ్వు ప్రత్యేకతను సంతరించుకుంది. భూమిలోపల ఉన్న గడ్డ మే నెల రాగానే మొక్కగా పెరిగి పూలతో వికసించింది. ఎండలు విపరీతంగా ఉండే మే నెలలోనే పూస్తుంది కనుకనే దీనిని మే ఫ్లవర్ అంటారు. ఎంత వేడిగా ఉంటే అంతగా ఇది పూలతో విరగబూస్తుంది. చూడ్డానికి ఎర్రని బంతిలా, ఆకట్టుకునేలా ఉంటుంది. ఇది లిల్లీ జాతికి చెందిన దుంప రకం మొక్క కాగా ఒక్క సారి నేలలో పాతితే అది చనిపోవడం అంటూ ఉండదు. నెమ్మదిగా పిలకలు వేస్తూ విస్తరిస్తూనే ఉంటుంది. ఎన్ఎఫ్‌సీకాలనీకి చెందిన మల్లికార్జునరావు గత కొన్ని సంవత్సరాల క్రితం ఆయన ఇంటి ఆవరణలో మే దుంపలను భూమిలో పాతగా ఇప్పుడు మే ఫ్లవర్ మొక్కలు విరివిగా పెరిగాయి. స్థానికులు వచ్చి ఇక్కడ మే ఫ్లవర్స్‌ను చూసి ఆహ్లాదాన్ని పొందుతున్నారని ఆయన పేర్కొన్నారు.



జూన్‌లో వికసించిన మే పుష్పాలు

# ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

**కడ్తాల్, జూన్ 5, ప్రభాత వార్త :** జల్సాలకు అలవాటు పడ్డ ఇద్దరు యువకులు సులభంగా డబ్బులు సంపాదించాలనే అత్యాశతో ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న ఇద్దరు యువకులను కడ్తాల్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు కడ్తాల్ ఇన్స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన విరాలు ఇలా ఉన్నాయి. ఇన్స్పెక్టర్ సైదిరెడ్డి పర్యవేక్షణలో గురువారం తలకొండపల్లి ఎక్స్ రోడ్డు వద్ద రాత్రి సమయంలో వాహనాలు తనిఖీలు చేస్తుండగా కడ్తాల పోలీసులు ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను పట్టుకొని విచారణ చేయగా వారు నడుపుతున్న స్కూటీని దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. పట్టుబడిన నిందితులు ఆమనగల్లు మండలం చంద్రాయన పల్లి తండా కు చెందిన జటావత్ చరణ్, తలకొండపల్లి మండలం బోడియా తండా విస్లావత్ అనిల్ విచారణలో మరో నిందితుడు కిల్లంపల్లి రాజశేఖర్ శేఖర్ ఈ చోరీలకు ప్రధాన సూత్రధారి అని వెల్లడైంది. నిందితులు సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో కడ్తాల్, చౌటుప్పల్, అధిబట్ల, చిట్యాల, దమ్మపేట తదితర ప్రాంతాలలో పార్క్ చేసి ఉన్న ద్విచక్ర వాహనాలను దొంగతనం చేసి, వాటి నంబర్ ప్లేట్లను మార్చి విక్రయించేందుకు ప్రయత్నించినట్లు విచారణలో తేలినట్లు ఆయన తెలిపారు. స్వాధీనం చేసుకున్న వాహనాలు హోండా యాక్టివా స్కూటీ - 1 రాయల్ ఎన్‌ఫీల్డ్ 350 సీసీ మోటార్ సైకిళ్లు - 2 పల్సర్ ఎన్ఎస్ 125 మోటార్ సైకిల్ - 1 పల్సర్ 125 మోటార్ సైకిల్ - 1మిగతా 3 మోటార్ సైకిళ్ల ఒక ఆటోను వివిధ ప్రాంతాలలో నిందితులు వదిలివేయగా, వాటిని కూడా స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. అదేవిధంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన మొత్తం 8 వాహన చోరీ కేసులు వెలుగులోకి వచ్చాయి. నిందితులు నేర కార్యకలాపాల కోసం ఉపయోగించిన మొబైల్ ఫోన్‌ను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు దొంగిలించిన వాహనాన్ని విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారనే సమాచారాన్ని అందుకున్న కానిస్టేబుల్ మహేష్ వెంటనే స్పందించి వారిని పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కేసు విచారణలో క్రైమ్ టీం కానిస్టేబుల్ రామకోటి, రఘునాయక్ చాకచక్యంగా వ్యవహరించి కీలక పాత్ర పోషించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వరప్రసాద్, ఎస్ఐ చంద్రశేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. నిందితులను పట్టుకొని, దొంగిలించిన మోటార్ సైకిళ్లను రికవరీ చేయడంలో కీలకంగా వ్యవహరించిన పోలీసు సిబ్బందిని ఇన్స్పెక్టర్ అభినందించారు. ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ సీపీ తరుణ్ జోషి సిబ్బంది పనితీరును అభినందించారు. ఇలాంటి ప్రతిభ కనబరిచిన వారికి తగిన రివార్డులు అందజేస్తామని ఇన్స్పెక్టర్ తెలిపారు.



# పర్యావరణ పరిరక్షణకు ప్రతి పౌరుడు పాటు పడాలి

**మేడ్చల్, జూన్ 5. ప్రభాతవార్త :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మేడ్చల్ నియోజకవర్గం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కండ్లకోయ అటవీ ప్రాంతంలో జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, మేడ్చల్ మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యాన్ని ఎదుర్కోవాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షి ంచాలని సూచించారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే పచ్చదనాన్ని పెంపొందించడమే మార్గమని పేర్కొన్నారు. ప్రభుత్వం, ప్రజలు కలిసి పనిచేస్తేనే పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలు సాధ్యమవుతాయని ఆయన అన్నారు.అనంతరం ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరం మొక్కలను నాటుతూ పర్యావరణాన్ని పరిరక్షి ంచాలని పిలుపునిచ్చారు. ప్రకృతి మనకు ప్రసాదించిన అమూల్యమైన సంపదను కాపాడుకోవడం అందరి బాధ్యత అని అన్నారు. పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించవచ్చని, నేడు నాటే ప్రతి మొక్క రేపటి తరాలకు ఆరోగ్యకరమైన జీవనానికి భరోసా అవుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహమ్మద్, ఎల్లంపేట మున్సిపల్ చైర్మన్ శ్రీదేవి, కౌన్సిలర్లు సురేష్‌రెడ్డి, ఓ ప్రకాష్, భాస్కర్, నాయకులు భాస్కర్ యాదవ్, రణదీప్‌రెడ్డి, దర్శన్, రఘుపతిరెడ్డి, నవీన్‌రెడ్డి, గణేష్, రాగజ్యోతి, హరత్‌రెడ్డి, అటవీశాఖ అధికారులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



కండ్లకోయలోని ఫారెస్ట్‌లో మొక్కలు నాటుతున్న ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి

# మొక్కలు భావితరాలకు స్వచ్ఛమైన ఆరోగ్య జీవనానికి పునాది

**ఎంపి ఈటల రాజేందర్**

**మేడ్చల్, జూన్ 5. ప్రభాతవార్త:** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఏక్ పెయిడ్ మాకా నామ్ కార్యక్రమంలో భాగంగా గుండ్లపోచంపల్లిలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యం, తగ్గిపోతున్న అటవీ సంపద వంటి సమస్యలను ఎదుర్కోవాలంటే ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షి ంచాలని పిలుపునిచ్చారు. నేడు మనం నాటే ప్రతి మొక్క భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన జీవనాన్ని అందించే అమూల్యమైన ఆస్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న "ఏక్ పేడ్ మా కే నామ్" కార్యక్రమం ద్వారా తల్లిపై ప్రేమను, ప్రకృతిపై బాధ్యతను చాటిచెప్పే గొప్ప సందేశం సమాజానికి అందుతుందని తెలిపారు. ప్రతి కుటుంబం, ప్రతి విద్యార్థి, ప్రతి యువకుడు ఈ కార్యక్రమంలో భాగస్వామి కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్, సీనియర్ నాయకులు విక్రమ్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, నాయకులు సతీష్ సాగర్, శ్రీనివాస్, దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, రాజి రెడ్డి, శివాజీ రాజు, సరిత, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎంపి ఈటల రాజేందర్

# మొక్కలు నాటిన అలియాబాద్, మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్లు

**శామీర్‌పేట, జూన్ 5, ప్రభాతవార్త:**

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అలియాబాద్ మున్సిపాల్టీలో, మూడుచింతలపల్లి మున్సిపాల్టీలో ఆయా మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కమిషనర్లు పాల్గొని మొక్కలు నాటారు. శుక్రవారం శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని లాల్‌గడిమలక్‌పేట్ ప్రాంతంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపల్ చైర్మన్ కంతం శిరీషకృష్ణారెడ్డి, కమిషనర్ ఎన్.వెంకట్‌రెడ్డి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు కౌన్సిలర్లు సరసం వనజఅశోక్‌రెడ్డి, గూడె వెంకటేశ, నాయకులు కోడూరి దినేశ్, సంబంధిత అధికారులు, బిల్‌కలెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా మూడుచింతలపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపల్ చైర్మన్ జాము రవి మొక్కలు నాటారు. కమిషనర్ వెంకటగోపాల్ కూడ పాల్గొని మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు తమ వంతుగా కృషి చేయాలని అన్నారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, భవిషత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించటం జరుగుతుందని మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు మున్సిపల్ మేనేజర్ ఉషా, సంబంధిత అధికారులు రాజేశ్వర్‌రెడ్డి, గౌతమి, మోహన్‌సింగ్, దేవేందర్, మల్లిఖార్జున్, సుభాష్, స్థానిక నాయకులు కె.వెంకటనర్సింహ్మారెడ్డి, బిల్‌కలెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మూడుచింతలపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటిన మున్సిపల్ చైర్మన్ జాము రవి, పాల్గొన్న కమిషనర్, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకుల దృశ్యం



చెత్త బుట్టలు పంపిణి చేస్తున్న నేతలు

## తడి,పొడి చెత్తను వేరు చేయాలి

**సర్పంచ్ గడ్డం వెంకటయ్య**

**కుల్కచర్ల,జూన్ 5 ప్రభాతవార్త:** తడి,పొడి చెత్తను వేరు చేయాలని సర్పంచ్ గడ్డం వెంకటయ్య అన్నారు.శుక్రవారం మండల పరిధిలోని పిరంపల్లి గ్రామంలో గ్రామ జ్రలకు తడి, పొడి చెత్త బుట్టలు పంపిణి చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ గడ్డం వెంకటయ్య మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ రక్షణ కోసం తడిచెత్త మరియు పోడి చెత్తను చేరు చేయడం ఎంతో అవసరంమని మన ఇళ్లలో వచ్చే వ్యర్థాలను సరిగ్గా గ్రామపంచాయతీ సిబ్బందికి అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్ రెడ్డి,ఉప సర్పంచ్ శాంత మొగులయ్య,వార్డు సభ్యులు రాజు, పుల్లయ్య,సినియర్ నాయకులు రమేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



సోషల్ కనెక్ట్ హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన్నారులకు దుస్తులు, బిస్కెట్లు పంపిణీ చేస్తున్న యూనివర్శిటీ అడ్మిషన్ డైరెక్టర్ ఎం. శ్రీనివాస్ రావు తదితరులు.

## నిరుపేద పిల్లలకు దుస్తుల పంపిణీ

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 5,ప్రభాత వార్త:** పోచారం డివిజన్ వెంకటాపూర్ అనురాగ్ యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ మల్లేశ్ ఆధ్వర్యంలో సోషల్ కనెక్ట్ హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ సహకారంతో శుక్రవారం నిరుపేద పిల్లలకు బట్టలు, తినుబండారాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. సోషల్ కనెక్ట్ హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ సీఈవో ఎం. హేమ, ముఖ్య అతిథి యూనివర్శిటీ అడ్మిషన్ డైరెక్టర్ ఎం. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ సమాజంలో వెనుకబడిన వర్గాలకు సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యతయని అన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలు విద్యార్థుల్లో మానవతా విలువలు సేవాభావాన్ని పెంపొందిస్తాయని ఎన్ఎస్ఎస్ సెల్ కో ఆర్డినేటర్ సి. మల్లేశ్ అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో విస్తృతంగా చేపట్టేందుకు కృషి చేస్తామని అన్నారు.

## రాష్ట్ర ఆర్థిక సంఘం కమిషన్ సభ్యులుగా ఆసిఫ్ అలీ ప్రమాణ స్వీకారం

**కడ్తాల్,జూన్ 5,ప్రభాత వార్త:** రంగారెడ్డి జిల్లా కడ్తాల పట్టణానికి చెందిన రేవంత్ మిత్రమండలి వ్యవస్థాపక అధ్యక్షుడు రాష్ట్ర ఆర్థిక సంఘం కమిషన్ సభ్యులు మహమ్మద్ ఆసిఫ్ అలీ శుక్రవారం హైదరాబాద్ లోని సోమాజిగూడ రాష్ట్ర ఆర్థిక సంఘం కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవలనే తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మెన్ సిరిసిల్ల రాజయ్య, సభ్యులుగా ఆసిఫ్ అలీ, రంగరాజు సుధీర్ రెడ్డి నియమితు లయ్యారు. వారికి రాష్ట్ర ఆర్థిక సంఘం సెక్రెటరీ క్యాతాయిని దేవి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం బాధ్యతలు తీసుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళ మిస్సింగ్

**జవహర్ నగర్, జూన్5,ప్రభాత వార్త:**

జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భర్తతో జరిగిన కుటుంబ కలహాల అనంతరం ఓ మహిళ ఇంటి నుంచి వెళ్లిపోయి కనిపించకుండా పోయిన ఘటన కాప్రా మండల పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. బాలాజీనగర్‌లోని మదర్ థెరిసా కాలనీలో నివాసం ఉంటున్న రిటైర్డ్ ఉద్యోగి రమణారావు ఫిర్యాదు మేరకు, జూన్ 3వ తేదీన తన భార్య యెల్లమ్మతో కుటుంబ విషయమై వాగ్వాదం జరిగింది. అనంతరం యెల్లమ్మ ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.కుటుంబ సభ్యులు ఆమె కోసం తెలిసిన ప్రాంతాలన్నింటిలో వెతికినప్పటికీ ఎలాంటి సమాచారం లభించలేదని తెలిపారు. బంధువులు, పరిచయస్తులను కూడా సంప్రదించినా ఆచూకీ దొరకకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు.ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి, మహిళ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఆమె ఎక్కడికి వెళ్లింది, ప్రస్తుతం ఎక్కడ ఉన్నది అనే విషయాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

## కాప్రా మండల తహసీల్దార్‌గా మతిన్ బాధ్యతల స్వీకారం

**జవహర్ నగర్ , జూన్ 5, ప్రభాత వార్త :** కాప్రా మండల తహసీల్దార్‌గా పనిచేసిన బైరెడ్డి రాజేష్ బదిలీ కావడంతో, నూతన తహసీల్దార్‌గా మతిన్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల రెవెన్యూ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.మండల ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందించేందుకు కృషి చేస్తానని మతిన్ తెలిపారు. రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో సమర్థవంతంగా పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు.

## మోడీ సుపరిపాలనకు గుర్తుగా అమ్మ పేరిట ఒక్క మొక్క

**మేడ్చల్, జూన్ 5. ప్రభాతవార్త :** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 12 సంవత్సరాల సుపరిపాలన విజయోత్సవాల సందర్భంగా మేడ్చల్ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షురాలు జల్లి శైలజ హరినాథ్ ఆధ్వర్యంలో అమ్మ పేరిట ఒక్క మొక్క (ఏక్ పేడ్ మా కే నామ్) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటారు.ఈ సందర్భంగా శైలజ హరినాథ్ మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం గత 12 సంవత్సరాలుగా అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతులు, జాతీయ భద్రత, మహిళా సాధికారత తదితర రంగాల్లో విశేష పురోగతి సాధించిందన్నారు. దేశ అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా మోదీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అమ్మ పేరిట ఒక్క మొక్క కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరు మీద ఒక మొక్కను నాటి ప్రకృతికి తమ వంతు సేవ చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కార్యక్రమ కో కన్వీనర్, మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు గౌరారం జగన్ గౌడ్, మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ కోశాధికారి లవంగ శ్రీకాంత్, మేడ్చల్ మాజీ సర్పంచ్ తాళ్ళపల్లి మురళీ గుప్త, బీజేపీ యువమోర్చా రాష్ట్ర నాయకుడు రాగం అర్జున్, మున్సిపల్ బీజేపీ ప్రధాన కార్యదర్శులు కానుకంటి వంశీ విజయ్ వంజరి, జకట ప్రేందాస్, నాయకులు బొజ్జ రాఘవ రెడ్డి, చీర్ల సత్యనారాయణ, సర్వేశ్వర రెడ్డి, మల్లాది హేమలత రెడ్డి, తోట అనిత, సాయి, విష్ణు, అవినాష్ చారి, బొజ్జ వంశీ రెడ్డి, వేముల సత్యనారాయణ రెడ్డి, జకట బాబు రాజు, చెరుకొమ్ము శ్రీనివాస్ గౌడ్, మహేష్ గౌలికర్, కానుకంటి భరత్, మామిళ్ళ నర్సింగ్, అర్జున్, దగ్గు రాజు, సాదమని నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్‌లో మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

**ఎల్లంపేట మున్సిపాలిటీలో...**

ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని బండమాదారం గ్రామంలోని శివాలయం ప్రాంగణంలో మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ రజిత, మున్సిపల్ పార్టీ ప్రధాన కార్యదర్శి మహేష్, నాయకులు పోచయ్య, బాబు, దేవేందర్‌రెడ్డి, కృష్ణ, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.